విజృంభిస్తున్న విష జ్వరాలు



సీజన్ మారింది.. వానలు జోరుగా కురుస్తున్నాయి. వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. విష జ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు జ్వరాలతో మంచం పట్టారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వారం రోజుల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు భారీగా కేసులు పెరుగుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, గొంతునొప్పి లక్షణాలతో ప్రభుత్వ ఆసుపత్రులకు జనం వస్తున్నారు. గత నెలతో పోలిస్తే వైరల్ ఫీవర్ కేసులు ఈనెల అధికంగా వస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో డెంగీ, మలేరియా కేసులు పెరుగుతున్నాయి. వారం రోజులుగా ప్రతి రోజూ 3వేల మందికి పైగా ఓపీకి రోగులు వస్తున్నారు. గ్రామాల్లో రెండు మూడు రోజులకు ఓసారి కూడా వైద్యసిబ్బంది చికిత్సలు అందించేందుకు వెళ్లడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని పీహెచ్‌సీల్లో మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత వైద్యులు ఇంటి ముఖం పడుతున్నారు. వాతావరణ మార్పుల దృష్ట్యా ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

- మంచం పట్టిన పల్లెలు
- అల్లాడిపోతున్న ప్రజలు
- కిక్కిరిసిపోతున్న ఆసుపత్రులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్నపెద్దా అనే తేడా లేకుండా వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్‌తో ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వారం రోజుల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు భారీగా కేసులు పెరుగుతున్నాయి. కర్నూలు, నంద్యాల, ఆదోని జీజీహెచ్‌ల్లో, ఎమ్మిగనూరు, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగాయి. ఈ ఓపీ కేసుల్లో 60శాతం వైరల్ ఫీవర్స్‌గా నమోదవుతున్నాయి.

ఆస్పత్రులకు క్యూ..

ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంత ప్రజలు మంచం పట్టారు. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులకు, గొంతునొప్పి లక్షణాలతో ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్నారు. గత నెలతో పోలిస్తే వైరల్ ఫీవర్ కేసులు ఈనెల అధికంగా వస్తున్నాయి. ఇంట్లో ఒకరు తర్వాత మరొకరు విషజ్వరాలతో అల్లాడిపోతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో నీరసించి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు మాత్రమే తగ్గడం లేదని రోగులు మళ్లీ మళ్లీ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.





కిటకిటలాడుతున్నాయి..

కర్నూలు, నంద్యాల, ఆదోని జీజీహెచ్‌లు, డోన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు ప్రైవేటు ఆసుపత్రులు, రోగులతో కిటకిటలాడుతున్నాయి. కర్నూలు జీజీహెచ్‌లో ప్రతిరోజు ఓపీకి 2700 మంది రోగులు వచ్చేవారు. పది రోజులుగా ఈ సంఖ్య పెరిగింది. ప్రతి రోజూ ఓపీకి వచ్చే రోగుల సంఖ్య 3వేలు దాటుతోంది. వీరిలో ప్రతి రోజూ 200 మంది దాకా అడ్మిషన్ పొందుతున్నారు. ఇందులో 70 శాతం వైరల్ ఫీవర్ కేసులు ఉండటం కలవరపెడుతోంది. నంద్యాల జీజీహెచ్‌లో కూడా ఓపీ రోగుల సంఖ్య 1300 నుంచి 1500 దాకా నమోదవుతున్నాయి. ఇక ఆదోని ఆసుపత్రిలో రోజు వారి ఓపీ 800 దాటుతోంది. విషజ్వరాలు పెరగడంతో కర్నూలు జీజీహెచ్‌లో పరీక్షల కోసం వేచి చూస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

మిగతా 6వ పేజీలో

ఏకదంతాయ.. వక్రతుండాయ..



6లో

కర్నూలు కేఎంసీ విద్యార్థులు ఏర్పాటు చేసిన మెడికో గణేష్

అర్హులందరికీ పింఛన్లు

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులందరికీ పింఛన్లు అందజేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలోని కొత్తపేటలోని మంగళి వీధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకొని పింఛన్లు పంపిణీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఏవిధంగా పని చేస్తోందని మంత్రి అడగ్గా.. ఈ ప్రభుత్వంలో చాలా సంతోషంగా ఉన్నామని ప్రజలు చెప్పారు. అనంతరం వీధిలో ఉన్న సమస్యలను స్థానికులు మంత్రికి వివరించారు. అన్నింటిని పరిష్కరించాలని మంత్రి కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, టీపీఆర్వో శ్రీనివాసులు, సూపరింటెండెంట్ మన్సూర్‌బాషా, 50వ వార్డు ఇన్‌చార్జి బోయ మనీష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ చేసిన కలెక్టర్

నగరంలోని ఒకటో వార్డు రామారావు గేట్‌లో కలెక్టర్ పి.రంజిత్‌బాషా పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ పి.విశ్వనాథ్, కార్పొరేటర్ పి.షాషావలి, నగర పాలక అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం లక్ష్యం

- చంద్రబాబుది మూడు దశాబ్దాల దూర దృష్టి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే, సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబుది మూడు దశాబ్దాల దూర దృష్టి అని అన్నారు. దేశ ప్రధాని, రాష్ట్రపతి, లోక్ సభ స్పీకర్ నియామకాల్లో చురుకైన పాత్ర పోషించారన్నారు. ఆ దిశగా ఉమ్మడి రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ అంటేనే అభివృద్ధి అనే చర్చసాగేలా పనిచేశారని గుర్తుచేశారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా అమరావతి, పోలవరంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించాలనుకుంటే సీఎంగా బాధ్యతలు చేపట్టిన జగన్మోహన్‌రెడ్డి సర్వనాశనం చేశాడని మండి పడ్డారు. ఈ సమావేశంలో నాయకులు పెద్ద వెంకటస్వామి గౌడ్, పుల్లయ్య చౌదరీ, పరమేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

అర్జీలను పరిష్కరించాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సీరియస్‌గా తీసుకోవాలని, వచ్చిన అర్జీలను నిర్ణీత గడువు లోపు నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సంతృప్తి స్థాయిలో పెరిగేలా అర్జీల పరిష్కారం ఉండాలన్నారు. అర్జీలను పరిష్కరించే సమయంలో అర్జీదారునితో వ్యక్తిగతంగా మాట్లాడితే నాణ్యతగా పరిష్కారం ఉంటుందని సూచించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో పరిష్కారం చేసిన అర్జీల నాణ్యతను ఆడిట్ చేయాలన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 12, పత్తికొండ ఆర్డీవో వద్ద 6, కర్నూలు ఆర్డీవో వద్ద 8, కలెక్టరేట్ ఏవో వద్ద 3, సర్వే ఏడీ, హౌసింగ్ పీడీ, డీఆర్‌డీఏ పీడీల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జేసీ బి.నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

నేటి నుంచి వేరుశనగ క్రయవిక్రయాలు

- పైలట్ ప్రాజెక్టు కింద 15 రోజుల పాటు గ్రేడింగ్ రద్దు
- సబ్ కలెక్టర్ చొరవతో చర్చలు సఫలం

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో వారం రోజులుగా నిలిచిన వేరుశనగ కొనుగోలు మంగళవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తన చాంబర్‌లో వ్యాపారులు, హమాలీలు, కమీషన్ ఏజెంట్లతో, మార్కెట్ యార్డ్‌కార్యదర్శి ఎం.కల్పన, సహాయకార్యదర్శి శాంత కుమార్‌తో కలిసి జరిపిన చర్చలు ఫలించాయి. వేరుశనగ దిగుబడులకు మార్కెటింగ్ శాఖ చట్టంలో లేని గ్రేడింగ్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారికి నష్టం కలిగించే అనధికార గ్రేడింగ్‌ను రద్దు చేయాల్సిందేనని సబ్‌కలెక్టర్ వ్యాపారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరుకు నాణ్యతను బట్టి కొనుగోలు చేయాలని వ్యాపారులకు సూచించారు. పైలట్ ప్రాజెక్టు కింద 15 రోజుల పాటు మార్కెట్ కమిటీలో రైతులు సదరు కమీషన్ ఏజెంట్ దుకాణం ముందు రాశులుగా పోసిన వేరుశనగ మహిళా కూలీలతో గ్రేడింగ్ చేయకుండా కొనుగోలు చేయాలన్నారు. యథావిధిగా వేరుశనగ క్రయవిక్రయాలు కొనసాగుతాయని మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన తెలిపారు. కమీషన్ ఏజెంట్లు రాజాగౌడ్, శ్రీరాములు, చంద్రకాంత్ రెడ్డి, వేరుశనగ వ్యాపారులు శరణప్ప, నాగరాజు, హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



హమాలీల సంఘం నాయకులతో సబ్ కలెక్టర్, మార్కెట్ యార్డ్ కార్యదర్శి

1,525 క్వింటాళ్ల ఉల్లి కొనుగోళ్లు

- ప్రభుత్వ మద్ధతుధర రూ.1200
- హర్షం వ్యక్తం చేసిన రైతులు

7

నిండుకుండలా శ్రీశైలం

- పది గేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. దీంతో డ్యాం నిండు కుండలా దర్శనమిస్తోంది. సోమవారం 10 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,67,440 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి ఎడమగట్టు జల ఉత్పాదన కింద 65,603 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తు న్నారు. జూరాల, సుంకేసుల నుంచి 2,35,163 క్యూసె క్కుల వరద జలాశయానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 885అడుగులు కాగా.. సోమ వారం సాయంత్రం 6 గంటలకు 882.10 అడుగులకు చేరింది. నీటి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా 199.7354 టీఎంసీలుగా నమోదైంది.

విచారించి న్యాయం చేస్తాం: ఎస్పీ

కర్నూలు క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ చెప్పారు. నగరంలోని కొత్తపేటలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి మొత్తం 90 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డీఎస్పీ బాబుప్రసాద్, సీఐలు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

మున్సిపల్ స్థలం కబ్జా

- 22 సెంట్ల విలువ రూ.2 కోట్లు పైనే
- ఇప్పటికే 8 సెంట్లు వేరొకరికి రిజిస్ట్రేషన్
- వైసీపీ నాయకుడి నిర్వాకం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్, రిజిస్ట్రేషన్ అధికారులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న మున్సిపల్ ఖాళీ స్థలాలకు రక్షణ లేకుండా పోతోంది. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అధికారంతో సంబంధం లేకుండా ఎవరో ఒకరు ఆ స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీకి చెందిన స్థలాలను కొంతమంది గుట్టు చప్పుడు కాకుండా కబ్జాచేసి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలో మున్సిపల్ పార్కు కోసం వదిలిన స్థలాన్ని వైసీపీకి చెందిన ఓ మాజీ ప్రజా ప్రతినిధి జీపీఏ చేయించుకొని ఏకంగా మరొకరికి రిజిస్ట్రేషన్ చేయించిన విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్ఎంటీ కాలనీలో 447/సీలో 1980-81లో తమకున్న భూమిని ఒకరు ప్లాట్లు వేశారు. ఇందులో భాగంగానే 42 సెంట్ల స్థలాన్ని పార్కు కోసం వదిలారు. ఇందులో రోడ్లుకు 20 సెంట్ల స్థలం పోగా మిగతా 22 సెంట్ల స్థలంలో మున్సిపల్ అధికారులు ఓ బోరు కూడా ఏర్పాటుచేసి ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఈ స్థలంపై అటు తరువాత అధికారంలోకి వచ్చిన వచ్చిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కన్ను పడింది. ఎలాగైన స్థలాన్ని కైవసం చేసుకోవాలని ప్రయత్నిస్తూ వచ్చాడు. తాను అధికారంలో ఉన్న ((2005-2010) సమయంలో ఓ సారి ప్రయత్నించి విఫలం కావటంతో మిన్నకుండిపోయాడు. ఆ తరువాత 2019లో తిరిగి ప్రయత్నాలు మొదలు పెట్టి స్థలానికి చెందిన పూర్వీకుల బినామీలతో తనపేరుపై పార్కు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తరువాత తన కూతురి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాడు.

మిగతా 8వ పేజీలో

పక్క చిత్రంలో కనిపిస్తున్న ఈ స్థలం ఎమ్మిగనూరు పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలో 447/సి లో 22 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. ఇది పార్కు కోసం వదిలిన స్థలం. ఈ స్థలంలో మున్సిపల్ అధికారులు బోరు కూడా ఏర్పాటు చేశారు. దీని విలువ రూ.2 కోట్లకు పైగానే పలుకుతుంది. ఇక్కడ సెంటు దాదాపు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలు విలువ చేస్తోంది. ఈ స్థలంపై పట్టణానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి, వైసీపీ నాయకుడి కన్ను పడింది. ఆయన అధికారంలో ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకు క్రమక్రమంగా స్థలాన్ని కబ్జా చేసేందుకు పావులు కదుపుతూ వస్తున్నాడు. ఇందుకు అటు రిజిస్ట్రేషన్ అధికారులు, ఇటు మున్సిపల్ అధికారులు సహకరిస్తూ వస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి



పెచ్చులూడి పడ్డాయి..

- సాతనూరు కొట్టాల పాఠశాలలో కూలిన పైకప్పు
- ఆదివారం కావడంతో తప్పిన పెను ప్రమాదం
- శిథిలావస్థకు చేరినా పట్టించుకోని పాలకులు, అధికారులు

కోసిగి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతనూరు కొట్టాల ప్రాథమిక పాఠశాలలో తరగతి గది పైకప్పు పెచ్చులూడి పడింది. అదృష్టవశాత్తు ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారనే చెప్పవచ్చు. సోమవారం ఉదయం ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్, విద్యా కమిటీ చైర్మన్ రవికుమార్ పాఠశాల తాళాన్ని తీశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుడు కూర్చొనే చోట సుమారు 5 అడుగుల మేర పైకప్పు కూలి శిథిలాలు కుర్చీ, బెంచ్‌లపై పడి ఉన్నాయి. పాఠశాల కూలిపోయే స్థితికి ఉందని, గతంలో కూడా విద్యాధికారులకు, నాయకులకు తెలియజేసినా ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు మొదటి, రెండో ఫేజ్‌లో కూడా పాఠశాల నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వమైనా ప్రభుత్వ పాఠశాలను కొత్తది నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, విద్యాకమిటీ చైర్మన్ రవికుమార్ కోరారు. ఇదే విషయాన్ని మండల విద్యాధికారి శ్రీనివాసులును వివరణ కోరగా పాఠశాలను పరిశీలించామని, అయితే గతంలో అధికారులు నాడు-నేడు పనులు చేపట్టకపోవడంతో పాఠశాల శిథిలావస్థకు చేరిందని, త్వరలోనే జిల్లా విద్యాధికారికి నివేదిక పంపిస్తామన్నారు.



పెచ్చులూడి పడిన పైకప్పు

ఏకదంతాయ.. వక్రతుండాయ..



దేవా నగర్‌లో కొలువైన వరసిద్ధి వినాయకుడు

భక్తిశ్రద్ధలతో గణేశ్ శరన్నవరాత్రి ఉత్సవాలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందడి కర్నూలు నగరంలో బాగా కనిపిస్తోంది. వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన గణేశ్ మంటపాల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు విచ్చేసి తొలిపూజల ఇలవేల్పునకు ప్రత్యేక పూజలు, అర్చనలు, విశేష హారతులు, గణేశ పంచాక్షరీ స్తోత్రాలు, అష్టోత్తర నామ పారాయణలు చేస్తున్నారు. గణేశ్ మంటపాల వద్ద సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత కచేరీలు, చిన్నారులకు ఆటలపోటీలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో ఆరో రోజున మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం అల్పాహారం పంపిణీ చేశారు. నగరంలో మెడికల్ కళాశాల హాస్టల్ ముందు ఏర్పాటు చేసిన గణపతి మూర్తి తెల్లని కోటు, మెడలో స్టెతస్కోపుతో దర్శనమిచ్చారు. సి.క్యాంపులో ఆదిశేషుని తలను దాచ్చి, నందివాహనంపై ఆసీనుడైన గణనాథుడు భక్తులను ఆకట్టుకుంటున్నాడు. భాగ్యనగర్‌లో సింహ వాహనంపై శాంతి వదనంతో, గణేశ్ నగర్‌లో భారీ గణపతి మూర్తి రూపంలో, సి.క్యాంపు ఆరోరానగర్‌లో తిరుమల శ్రీవారిని తలపై దాల్చిన గణపతి మూర్తి, అదేప్రాంతంలో శివాజీ మహారాజ్ పక్కన పెట్టుకొని, సూర్యతేజోవంతుడైన వినాయకుడు దర్శనం ఇస్తున్నారు. బిర్లా కాంపౌండ్‌లోని దేవానగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకుడి వద్ద ఏర్పాటు చేసిన ఆర్కెస్ట్రా ఆకట్టుకుంది. లక్ష్మీనగర్, ప్రకాశ్‌నగర్‌లలో శాంతమూర్తి గణపతి విగ్రహాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.




అరోరానగర్..


భాగ్యనగర్...


సీ క్యాంప్..


లక్ష్మీ నగర్‌లో..


గణేష్ నగర్

సర్టిఫికెట్ తారుమారు

ఒక్క ఐడియా జీవితానే మార్చివేస్తుంది.. ఒక్క చెత్త ఐడియా ఎందరో జీవితాలను నాశనం చేస్తుంది.. ఇలాంటి ఓ ఆలోచనతోనే జిల్లా స్పోర్ట్ అధికారులు వ్యవహరించడంతో ఓ ప్రతిభావంతుడైన క్రీడాకారుడు ఉద్యోగాన్ని కోల్పోయాడు. క్రీడల్లో ప్రతిభను చాటుతూ ఎన్నో విజయాలు సొంతం చేసుకున్నాడు గొల్ల రామాంజనేయులు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన పలు పోటీల్లో పాల్గొన్నాడు. ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాడు. డీఎస్సీలో ఉద్యోగం పొందేందుకు జాతీయ స్థాయి సర్టిఫికెట్ లేకపోవడంతో మిన్నకుండిపోయాడు. కానీ అసలు అతడి సర్టిఫికెట్ అదే పేరు ఉన్న ఓ కేటుగాడి చేతిలోకి వెళ్లింది. దీంతో ఉద్యోగం పొందాలనుకొని సర్టిఫికెట్ల పరిశీలనలో దొరికిపోయాడు.. దీనికి సంబంధించిన వివరాలు..

- జిల్లా స్పోర్ట్స్ అధికారుల తప్పిదం
- ప్రతిభావంతుడికి తీవ్ర అన్యాయం
- ఉద్యోగం కోల్పోయిన నిరుద్యోగి
- డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన బయటపడిన వైనం
- అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు


బాధితుడు గొల్ల రామాంజనేయులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్పోర్ట్స్ అధికారుల తప్పిదంతో ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఓ నిరుద్యోగి ఉద్యోగాన్ని కోల్పోవలసి వచ్చింది. ఒకరి స్పోర్ట్ సర్టిఫికెట్‌ను అదే పేరుగల మరో వ్యక్తికి గుట్టుచప్పుడు ఇచ్చారు. ఆ సర్టిఫికెట్‌తో డీఎస్సీ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవటం.. సర్టిఫికెట్ల పరిశీలనలో బ్యాకప్ సర్టిఫికెట్లును అధికారులు అడగటంతో అసలు విషయం కాస్త వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న గొల్ల రామాంజనేయులు ఇంటర్మీడియట్ చదివి యూజీపీడీ కోర్సును పూర్తిచేశాడు. మొదటి నుంచి రన్నింగ్‌లో ఉత్తమ ప్రతిభను కనబరుస్తూ వచ్చాడు. ఈ క్రమంలో కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. 2015లో కడపలో జరిగిన రాష్ట్రస్థాయిలో జరిగిన క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభకనబరచి మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. 2016లో పూణేలో జరిగిన జాతీయస్థాయి 50 అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని 19వ స్థానంలో నిలిచాడు. దీనికి సంబంధించిన సర్టిఫికెట్ ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేస్తూ వచ్చారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులకు స్పోర్ట్ కోటాలో డీఎస్సీ (పీఈటీ పోస్టుకు)కి నేరుగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. గొల్ల రామాంజనేయులుకు జాతీయ స్థాయి సర్టిఫికెట్ అధికారులు ఇవ్వకపోవటంతో డీఎస్సీలో దరఖాస్తు చేసుకునే అవకాశం కోల్పోయాడు.

అథ్లెటిక్స్‌లో పాల్గొనని అదేపేరు ఉన్న మరో వ్యక్తికి..

ఎన్నడూ అథ్లెటిక్స్‌లో పాల్గొనని అదేపేరు ఉన్న మరో వ్యక్తికి అధికారులు గుట్టుచప్పుడు కాకుండా జాతీయ స్థాయి సర్టిఫికెట్‌ను ఇచ్చారు. దీంతో సదరు వ్యక్తి నేరుగా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం కోసం జాతీయస్థాయి సర్టిఫికెట్‌లో పుట్టిన తేదీని మార్చి దరఖాస్తు చేసుకున్నాడు. ఆయన పేరు మెరిట్ లిస్టులో వచ్చింది. ఇటీవల విజయవాడలో జరిగిన సర్టిఫికెట్ల పరిశీలన సందర్భంగా అధికారులు సదరు వ్యక్తిని గతంలో అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న సర్టిఫికెట్లు తీసుకురావాలని కోరారు.

డీఎస్సీకి అవకాశమివ్వాలి

జాతీయ స్థాయిలో అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని సర్టిఫికెట్ సాధించా. నా సర్టిఫికెట్‌ను జిల్లా స్పోర్ట్స్ అధికారులు మరొకరికి ఇచ్చారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. నా సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి మెరిట్ లిస్టులో పేరు వచ్చింది. ఈవిషయం నాకు తెలియటంతో రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశాను. అతడి పేరును తొలగించారు. ఆ స్థానంలో నాకు డీఎస్సీలో అవకాశం ఇచ్చేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకోవాలి.

● గొల్ల రామాంజనేయులు, ఎమ్మిగనూరు

సర్టిఫికెట్ల కోసం మభ్యపెట్టే ప్రయత్నం..

అతని దగ్గర ఆ సర్టిఫికెట్లు లేకపోవటంతో ఎలాగైనా ఉద్యోగాన్ని పొందాలన్న తలంపుతో అసలైన అథ్లెటిక్ గొల్ల రామాంజనేయులును ఆశ్రయించి సర్టిఫికెట్ల కోసం మభ్యపెట్టే ప్రయత్నం చేశాడు. దీంతో అసలు విషయం బయటపడింది. తనకు జరిగిన అన్యాయాన్ని జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు గొల్ల రామాంజనేయులు ఫిర్యాదు చేశాడు. ఒకరి ప్రతిభకు సంబంధించిన సర్టిఫికెట్లను మరొకరికి కట్టబెట్టిన సంబంధిత అధికారులపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని క్రీడాకారులు కోరుతున్నారు.

కవులు, కళాకారులకు సహకారం

● అరుణ భారతి వ్యవస్థాపకులు బీసీ రాజారెడ్డి


సుధీర్‌బాబును సత్కరిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, గురూజీ రామశేషయ్య, తదితరులు

బనగానపల్లె, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : కవులు, కళాకారులను అరుణ భారతి సాహితీ సంస్థ ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు అండగా ఉంటుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు బీసీ రాజారెడ్డి అన్నారు. పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో ఆరుద్ర శత జయంతి సందర్భంగా కొండపేటకు చెందిన కవి, రచయిత సుధీర్‌బాబును బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ సుధీర్‌బాబు ఇప్పటి వరకు మూడువేలకుపైగా కవితలు రాసి ఎంతో మంది మన్ననలు పొందారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కవులు, కళాకారులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, భగవద్గీత ప్రచారకులు గురూజీ రామశేషయ్య, ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయకుమార్, ప్రముఖ జ్యోతిష్య పండితుడు వెంకటరాముడుశాస్త్రి, రోటరీ క్లబ్ సభ్యుడు బలరామయ్య, భరతుడు, బొబ్బల మహేశ్వరరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలి

● ఇన్‌చార్జి వీసీ బసవరావు


మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఇన్‌చార్జి ఉపకులపతి వి. వెంకట బసవరావు కోరారు. క్లస్టర్ వర్సిటీలో సోమవారం రిజిస్ట్రార్ జి. శ్రీనివాస్ అధ్యక్షతన అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ కళాశాలలకు అటానమస్ హోదా సాధన కోసం తీసుకోవాల్సిన వ్యూహాల గురించి సూచనలు చేశారు. న్యాక్ గుర్తింపు కోసం అనుసరించాల్సిన నూతన ప్రక్రియలు, క్రీడల అభివృద్ధి, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ విస్తరణ, త్వరలోనే స్థాపించనున్న ఇంక్యుబేషన్ సెంటర్ గురించి వివరించారు. విద్యార్థుల్లో పరిశోధన నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం, వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్న వివరాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి, కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. వెంకటరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బీఆర్ ప్రసాదరెడ్డి, రంగారెడ్డి, డీన్ అక్తర్ భాను, అధ్యాపకులు మహమ్మద్ వాహీజ్, నాగరాజ్ శెట్టి, ఎగ్జామినేషన్‌కంట్రోలర్ బాలసుబ్రహ్మణ్యం, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సంతానోత్పత్తి కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ


ఐవీఎఫ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంతానోత్పత్తి కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించి సక్రమంగా వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్.వెంకటరమణ ఆదేశించారు. పట్టణంలో నెరవాటి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ మాతృత్వ ఐవీఎఫ్ కేంద్రం, ఐకాన్ ఐవీఎఫ్ కేంద్రాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐవీఎఫ్ కేంద్రాలకు సంబంధించిన పత్రాలు, రిజిస్ట్రేషన్, రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతమందికి సంతానోత్పత్తి చికిత్స చేశారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పేదవారికి కూడా కేంద్రాల్లో రుసుం తగ్గించి సేవలు అందించాలని సూచించారు. ఐవీఎఫ్ కేంద్రాలపై ఫిర్యాదులు అందితే విచారించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంతానం కోసం వచ్చే దంపతులను వేధించకుండా, ధరలతో భయభ్రాంతులకు గురిచేయకుండా చూడాలని సూచించారు. ఐవీఎఫ్, సరోగసీ విధానాలపై ముందస్తు అవగాహన కల్పించాలని ఆదేశించారు. స్కానింగ్ గది బయట, లోపల, రిసెప్షన్ సెంటర్ వద్ద ఐఈసీ బోర్డును ప్రదర్శించాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేయకూడదని ఫారం-ఎఫ్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ధరల పట్టికను రిసెప్షన్ కౌంటర్‌వద్ద ప్రజలకు అర్థమయ్యేలా ప్రదర్శించాలన్నారు. నిర్దేశించిన సమయంకంటే రెండు నెలలు ముందుగానే రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేసుకోవాలన్నారు. తనిఖీలో డాక్టర్ భరత్‌కుమార్, ఇన్‌చార్జి డెమో కె.రంగనాయక్ పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో షణ్ముఖకు బంగారు పతకం


షణ్ముఖకు గోల్డ్‌మెడల్ ప్రదానం చేస్తున్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అండర్-17లో మహానంది మండలం తమడపల్లెకి చెందిన డి.షణ్ముఖ బంగారు పతకం సాధించాడు. తూర్పుగోదావరి జిల్లా భీమవరంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఆగస్టు 26న ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. సెప్టెంబరు 8నుంచి 13వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హల్వానీలో జరిగే జాతీయస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్నట్లు కోచ్ లక్ష్మణ్ తెలిపారు. షణ్ముఖను తల్లిదండ్రులు డి.మురళి, డి.హుసేన్‌బీ, గ్రామస్థులు అభినందించారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేతలకు సన్మానం


రాష్ట్ర స్థాయి విజేతలను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో విజేతగా ఉమ్మడి కర్నూలు జట్టు నిలిచింది. ఆగస్టు 29నుంచి 31వరకు నెల్లూరు జిల్లా గూడూరు మండలం చెవ్వూరు రామదూత ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురురాజా పాఠశాలలో విజేతలైన జట్టుకు సోమవారం ప్రత్యేకంగా అభినందించి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు స్నేహభావంతో విజయాలు సాధించవచ్చన్నారు. తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్, బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న టీజీవీ కళాక్షేత్రంలో శాస్త్రీయ నృత్య పోటీలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని శాంతి తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో శాస్త్రీయ (సోలో డ్యాన్స్) నృత్య పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు ఎం.మనోహర్ బాబు తెలిపారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 7న మధ్యాహ్నం 3 గంటలకు ఈ నృత్య పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. దివంగత నాట్యరత్న వెంకటస్వామి సంస్మరణ సభ సందర్భంగా ఈపోటీలు ఉంటాయన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. పేర్లను నమోదు చేసుకునేందుకు 9100437765 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపాలన్నారు. పోటీల్లో ఏకవ్యక్తి నృత్యం (సోలో డ్యాన్స్) మాత్రమే అనుమతి ఉంటుందని, 10 నుంచి 20 ఏళ్ల వయసుగల వారు మాత్రమే పోటీలకు అర్హులని తెలిపారు. పోటీదారులు 8 నిముషాల వ్యవధిలోనే ప్రదర్శన చేయాలని, ఆహార్యం, దుస్తులు వారే సమకూర్చుకోవాలని తెలిపారు. 7న సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి అతిథులుగా టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు, కళారత్న పత్తి ఓబులయ్య, గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ శంకరశర్మ హాజరవుతారని తెలిపారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

5వ పేజీ తరువాయి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో డెంగీ, మలేరియా కేసులు పెరుగుతున్నాయి. నంద్యాల జిల్లాలో 95 డెంగీ కేసులను గుర్తించారు. మలేరియా కేసులు 12గా గుర్తించారు. బేతంచెర్ల, నందికొట్కూరు, డోన్, నంద్యాల ప్రాంతాల్లో డెంగీ వ్యాధిగ్రస్థుల సంఖ్య అధికంగా ఉంది. ఇక కర్నూలు జిల్లాలో జనవరి నుంచి ఆగస్టు వరకు 187 డెంగీ కేసులు వచ్చాయి. ఇందులో సి.బెళగల్ మండలంలో అత్యధికంగా 15, క్రిష్ణగిరి మండలంలో 13, నన్నూరు పీహెచ్‌సీలో 11, హాలహర్విలో పీహెచ్‌సీలో 8, ఉలిందకొండ పీహెచ్‌సీలో 8, లద్దగిరి పీహెచ్‌సీలో 8 కేసులు వెలుగు చూశాయి. ఇక మలేరియా కేసులు 8 గుర్తించారు. కర్నూలు అర్బన్‌లో-2, ఓర్వకల్లు, రేమట ప్రాంతాల్లో కేసులు గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో పలు ఆసుపత్రుల్లో డెంగీ కిట్లు ఉన్నప్పటికీ నిర్ధారణ పరీక్షలు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. డెంగీతో పాటు వర్షాలు కురుస్తుండటంతో నీరు కలుషితం కావడంతో టైఫాయిడ్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. గ్రామాల్లో రెండు మూడు రోజులకు వైద్యసిబ్బంది చికిత్సలు అందించేందుకు వెళ్లడం లేదు. అన్ని పీహెచ్‌సీలో మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత వైద్యులు ఇంటి ముఖం పడుతున్నారు. కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కార్యాలయం వదిలి బయటకు వెళ్లడం లేదు. ప్రోగ్రాం ఆఫీసర్లకు అద్దె వాహనాలు ఇచ్చినా కర్నూలు నగరం దాటి బయటకు పోవడం లేదు. దీంతో పర్యవేక్షించే అధికారులు లేకపోవడంతో గ్రామీణ వైద్యం అటకెక్కింది.



వైరల్ ఫీవర్లపై ఆందోళన వద్దు



వారం రోజుల నుంచి వైరల్ ఫీవర్ కేసులు అధికంగా వస్తున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో కేసులు పెరిగాయి. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి లక్షణాలతో వస్తున్నారు. వైరల్ ఫీవర్లపై ఆందోళనవద్దు. పారాసిటమాల్ మాత్రలు వేసుకుని నీరు బాగా తాగి న్యూట్రిషన్ ఫుడ్ తీసుకుంటే జ్వరం తగ్గిపోతుంది.

● డాక్టర్ కె.విద్యాసాగర్, ప్రొఫెసర్ ఆఫ్ జనరల్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు

సీజనల్ వ్యాధులు పెరిగాయి



వాతావరణ మార్పులు, ఇటీవల కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు పెరిగాయి. ఓపీకి వచ్చే కేసుల్లో 70శాతం వైరల్ ఫీవర్ కేసులే అధికంగా వస్తున్నాయి. నాలుగు రోజులైనా జ్వరం తగ్గని వారు వెంటనే వైద్యులను సంప్రదించాలి. సీజన్ మారుతున్న నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.

● డాక్టర్ డమం శ్రీనివాసులు, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు

రోగుల సంఖ్య పెరిగింది



సీజనల్ వ్యాధులతో జీజీహెచ్‌కు వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. గురువారం ఆసుపత్రిలో ఓపీకి రికార్డు స్థాయిలో 3330 రోగులు వచ్చారు. ఇందులో 215 మంది అడ్మిషన్ పొందారు. మొత్తం 1247 మంది ఆసుపత్రిలో వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల్లో విషజ్వరాల తీవ్రత అధికంగా ఉంటే అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నాం.

● డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

ఐఐఐటీడీఎంలో 'స్పేస్ ఆన్ వీల్స్'

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన


వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న ఐఐఐటీడీఎం ప్రాంగణంలో సోమవారం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ, ఐఐఐటీడీఎం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'స్పేస్ ఆన్ వీల్స్' విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఇస్రో ఆధ్వర్యంలో జరిగే శాటిలైట్ మోడల్స్, రాకెట్ మోడల్స్ ప్రదర్శన విద్యార్థులను కనువిందు చేసింది. ఇస్రో ఆధ్వర్యంలో ప్రారంభం నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన గగన్‌యాన్ మిషన్ వర్క్ జరిగిన విజయాలను రిటైర్డు ఇస్రో సైంటిస్టు, కర్నూలు ఐఐఐటీడీఎం ప్రొఫెసర్ చంద్రశేఖర్ ప్రదర్శనకు తరలివచ్చిన విద్యార్థులకు అర్థవంతంగా, సరళమైన భాషలో వివరించారు. ఈ స్పేస్ ఆన్ వీల్స్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ వెంకట బసవరావు లాంఛనంగా ప్రారంభించారు. రిటైర్డు ఇస్రో సైంటిస్టు, అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 2023 ఆగస్టు 23వ తేదీన భారతదేశం మొట్టమొదటి సారిగా ఇస్రో ఆధ్వర్యంలో సదరన్ కోల్డ్ రీజియన్ స్పాట్ మీద ల్యాండింగ్ చేసిన సందర్భంగా ప్రతి సంవత్సరం ఇదే రోజున నేషనల్ స్పేస్ ఆన్ వీల్స్ డే జరుపుకున్నట్లు తెలిపారు. వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి 2వేల మంది విద్యార్థులు ప్రదర్శనను సందర్శించారు.

పట్టపగలే వృద్ధురాలి దారుణహత్య

- సాయివైభవ్‌నగర్‌లో ఘటన
- వంట మనిషిపైనే అనుమానం
- ఉలిక్కిపడ్డ పోలీసు శాఖ



కాటసాని శివలీల(ఫైల్)

కర్నూలు క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఓ వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా కొట్టి చంపారు. ఈ ఘటన త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేశ్ నగర్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈఘటనతో పోలీసు శాఖ ఉలిక్కి పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సాయి వైభవ్‌నగర్‌లోని ఓ విల్లాలో కాటసాని శివలీల(72) ఒంటరిగా ఉంటుంది. ఆమె భర్త సాంబశివారెడ్డి ఏడాదిన్నర క్రితం మృతిచెందాడు. కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు గంగాధర్‌రెడ్డి అమెరికాలో డాక్టర్‌గా స్థిరపడ్డాడు. కూతురు ఉమామహేశ్వరమ్మ కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తుంది. ఆమె భర్త (రిటైర్డు ఏసీపీవో) చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి వెంకటరమణ కాలనీలో నివాసముంటుంది. శివలీల విల్లాలో ఒంటరిగా ఉంటూ ఇంటిపై ఉన్న పెంట్ హౌస్‌ను ఇద్దరు మెడికల్ రెప్‌లకు అద్దెకు ఇచ్చారు. కూతురు ఉమామహేశ్వరమ్మ కొద్ది కాలంగా తల్లివద్దనే ఉంటూ కళాశాలకు వెళ్లి వస్తుంది. అల్లుడు చంద్రశేఖర్ రెడ్డి వీరి ఇంటికి తరుచూ వచ్చి వెళ్తుంటారు. సోమవారం కూడా కూతురు కళాశాలకు వెళ్లింది. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో అల్లుడు చంద్రశేఖర్ రెడ్డి శివలీల ఇంటికి వచ్చాడు. లోపల శివలీల రక్తపు మడుగులో పడి ఉండటం చూసి భార్య ఉమామహేశ్వరమ్మకు ఫోన్‌చేశాడు. కొన ఊపిరితో పడి ఉన్న ఆమెను స్థానికులు, పోలీసుల సాయంతో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నగల కోసమే ఈ హత్య జరిగి ఉండవచ్చనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హత్య చేసిన వెంటనే బెడ్‌రూంలో కూడా నగల కోసం వెతికినట్లుగా గుర్తించారు. ఎక్కువ సమయం లేక వదిలేసి వెళ్లి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

గొలుసు, రెండు గాజులు మాయం

శివలీల మెడపై పదునైన ఆయుధంతో దాడి చేయడంతో రక్తస్రావమైంది. ఆమె మెడలో ఉన్న గొలుసు, రెండు బంగారు గాజులు మాయమైనట్లు కూతురు ఉమామహేశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంట్లో ఇతర వస్తువులు ఏమీ పోలేదని పోలీసులు తెలిపారు. హతురాలి ఇంట్లోని సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో పోలీసులకు ఇబ్బందిగా మారింది. కాలనీలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కాటసాని శివలీల ఇంట్లో పనిచేసే వంటమనిషి వరలక్ష్మిపైన అనుమానాలు వ్యక్తం చేస్తూ కూతురు ఫిర్యాదు చేసింది. రెండు రోజుల క్రితమే ఆమె పని మానేసిందని పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. ఈరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు ఫోన్‌చేసి పనికి రావాల్నా అని అడిగిందని, ఆమెపైనే అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొంది

అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తాం

సంఘటన తెలిసిన వెంటనే సాయంత్రం ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఘటనాస్థలిని పరిశీలించారు. డీఎస్పీ బాబుప్రసాద్, త్రీటౌన్ సీఐ శేషయ్య, నాలుగో పట్టణ సీఐ విక్రమసింహ, రూరల్ సీఐ శ్రీధర్‌తో పాటు పలువురు ఎస్ఐలు, క్రైం పార్టీ కానిస్టేబుళ్ల సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని ఎస్పీ వెల్లడించారు.

పలువురి పరామర్శ



పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

హతురాలు కాటసాని శివలీల పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి దూరపు బంధువు. కాటసాని ఆమె స్వగృహానికి చేరుకుని కూతురు, అల్లుడిని పరామర్శించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సైతం హతురాలి ఇంటికొచ్చి కుమార్తె అల్లుడులను పరామర్శించారు.

బంగారు వ్యాపారి..

- మసీదుకు వెళ్లి వస్తుండగా మారణాయుధాలతో దాడి
- ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



రక్తపు మడుగులో పడి ఉన్న హిజార్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బంగారు వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాధాకృష్ణ థియేటర్ సమీపంలో చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కొత్తపేటకు చెందిన హిజార్(42)స్థానిక షరాఫ్ బజారులో బంగారు నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి రాధాకృష్ణ థియేటర్ సమీపంలో ఉన్న ఓ మసీదుకు వెళ్లి తిరిగి వస్తుండగా కొంతమంది యువకులు మారణాయుధాలతో అతడిపై దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన హిజార్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, వన్‌టౌన్ సీఐ పార్థసారధి ఘటనా స్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. పాతబస్తీకి చెందిన ఇర్ఫాన్, ఇమ్రాన్ అనే వ్యక్తులపైన అనుమానం వ్యక్తం చేస్తూ హతుడి తండ్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

1,525 క్వింటాళ్ల ఉల్లి కొనుగోళ్లు

- ప్రభుత్వ మద్దతు ధర రూ.1200
- హర్షం వ్యక్తం చేసిన రైతులు



ఉల్లిగడ్డలను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, జేసీ నవ్య, అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునేందుకు చేపట్టిన కార్యక్రమానికి స్పందన లభించింది. కర్నూలు మార్కెట్ యార్డుకు సోమవారం వచ్చిన 1,525 క్వింటాళ్ల ఉల్లిని ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.1,200 చొప్పున రైతులకు చెల్లించి కొనుగోలు చేసింది. ఉమ్మడి జిల్లాలోని వివిద గ్రామాల నుంచి 1,607 క్వింటాళ్ల ఉల్లిని రైతులు అమ్మకానికి తెచ్చారు. ఇందులో 1,525 క్వింటాళ్ల ఉల్లిని మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాకు రూ.1,200 ప్రకారం కొనుగోలు చేశారు. 1,607 క్వింటాళ్లలో 554 క్వింటాళ్లను వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు టెండర్లు వేశారు. కిలో రూ.6 నుంచి కేవలం రూ.8లకు కొనుగోలు చేసేందుకు టెండర్లు వేశారు. అయితే రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఆ 554 క్వింటాళ్ల ఉల్లిని కూడా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసింది. 1,607 క్వింటాళ్లలో 82 క్వింటాళ్లను వ్యాపారులు రూ.1,329 ప్రకారం కొనుగోలు చేశారు.

56.50 క్వింటాళ్లు తీసుకొచ్చా



మార్కెట్ యార్డుకు 56.50 క్వింటాళ్ల ఉల్లిని తీసుకొచ్చా. క్వింటా రూ.517తో కొనుగోలు చేస్తామని వ్యాపారులు తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ.1200 క్వింటా చొప్పున పంటను కొనుగోలు చేసింది. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- చంద్రప్ప, పార్లపల్లె, ఎమ్మిగనూరు మండలం

సంతోషంగా ఉంది



ఉల్లి రైతుల కష్టాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. అందుకే రూ.1200 మద్దతు ధరతో కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. నేను 25 క్వింటాళ్ల ఉల్లిని తీసుకొచ్చాను. రూ.1200 మద్దతు ధరతో విక్రయించాను. చాలా సంతోషంగా ఉంది.

- మద్దయ్య, ఎర్రగుడి గ్రామం, కృష్ణగిరి మండలం

రైతులకు అండగా ప్రభుత్వం

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



రైతుతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎల్లప్పుడూ ప్రభుత్వం అండగా ఉంటుందని, అందువల్ల రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం ఉదయం మంత్రి కర్నూలు మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో క్వింటం ఉల్లికి రూ.1,200 ధర అందించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉల్లికి ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధరపై రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం సంతోషంగా ఉందని, ప్రస్తుతం అందిస్తున్న క్వింటానికి రూ.1,200తో పాటు మరికొంత సాయాన్ని అందించాలని రైతులు కోరారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఇబ్బందులను ఎప్పటి కప్పుడు గుర్తించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కష్టాల్లో ఉన్న రైతులు, అన్ని వర్గాల ప్రజలకు తక్షణ సాయం అందించేందుకు సీఎం చంద్రబాబు ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందేందుకు రైతులు అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కడప జేడీ రామాంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, ఏడీఎం నారాయణ మూర్తి, కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, యార్డు చైర్మన్ గోల్కొండ అఖ్మీత్‌బీ, వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి, డైరెక్టర్లు, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నగేష్, శివన్న పాల్గొన్నారు.

కలెక్టర్ సందర్శన: కర్నూలు మార్కెట్ యారులో ఉల్లి విక్రయాలను కలెక్టర్ రంజిత్ బాషా పరిశీలించారు. జేసీ నవ్యతో పాటు మార్క్‌ఫెడ్ అధికారులతో వెళ్లి ఉల్లి రైతులతో మాట్లాడారు.

క్వింటా ఉల్లి రూ.2,500కు కొనుగోలు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

కర్నూలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లిగడ్డలు క్వింటా రూ.2,500చొప్పున కొనుగోలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. జిల్లాలో దేవనకొండ, సి.బెళగల్, ఆస్పరి, గోనెగండ్ల, కోసిగి, కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, వెల్దుర్తి మండలాల్లో ఉల్లి సాగు అధికంగా చేస్తున్నారని తెలిపారు. అత్యంత కరువు పీడిత ప్రాంతమైన ఈ జిల్లాలో బోరుబావుల కింద 15 శాతం ఉల్లి పంట సాగు చేస్తున్నారన్నారు. ఈ ఏడాది అధిక వర్షాలకు భారీగా తగ్గిందని తెలిపారు. చేతికొచ్చిన అరకొర పంటను మార్కెట్‌కు తీసుకెళితే క్వింటా రూ.500-600లకు మించి కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం క్వింటా రూ.1,200లకు కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకుందని, పెరిగిన పెట్టుబడి కారణంగా గిట్టుబాటు కావడం లేదని వివరించారు. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కమిటీ తరపున సీఎంకు లేఖ రాశామని రామకృష్ణ వివరించారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స



చికిత్స అనంతరం రోగితో సూపరింటెండెంట్, వైద్యులు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జీజీహెచ్‌లో ఓ మహిళకు అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు. మహిళ కడుపులో 5కేజీల భారీ అండాశయ సిస్టును శస్త్రచికిత్స ద్వారా బయటకు తీశారు. 30ఏళ్ల మహిళ కడుపులో నాలుగు నెలల్లో అంతభారీగా పెరగడం అత్యంత అరుదైన సంఘటన అని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి సోమవారం తెలిపారు. ఆగస్టు 20న ప్రసూతి గైనకాలజీ విభాగం వైద్యులు అనస్థీషియా విభాగం సహకారంతో విజయవంతంగా శస్త్రచికిత్స చేసి రోగిని సురక్షితంగా కాపాడారని ఆమె అన్నారు. శస్త్రచికిత్సలో ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ డాక్టర్ పి.పద్మజ, అసోసియేట్ ప్రొఫెసర్ డా.లక్ష్మీ నారాయణమ్మ, డా.సుధారాణి, డా.ఓ.శ్రీనివాస్‌లు పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. ఆస్పత్రిలో వైద్య బృందం సమన్వయం, నైపుణ్యం, సేవాస్ఫూర్తికి ఈ సంఘటన నిదర్శనమన్నారు.

నిమజ్జన ర్యాలీలో ఘర్షణ

- హెడ్ కానిస్టేబుల్‌పై దాడి



గాయపడిన హెడ్ కానిస్టేబుల్

ఆదోని రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెసలబండ గ్రామంలో సోమవారం గ్రామానికి చెందిన యువకులు హెడ్ కానిస్టేబుల్‌పై షేక్ సాబ్‌పై దాడి చేశారు. వివరాల మేరకు.. గ్రామంలోని చెరువులో నిమజ్జనం చేసేందుకు విగ్రహాలను తరలిస్తున్నారు. ర్యాలీలో రెండు వర్గాల యువకులు పరస్పరం గొడవ పడుతుండటంతో కానిస్టేబుల్ వినోద్‌తో కలిసి సర్దుబాటు చేసేందుకు వెళ్లారు. కాగా గ్రామానికి చెందిన బెస్త సూరి అనే యువకుడు కట్టెతో హెడ్‌కానిస్టేబుల్ షేక్‌సాబ్‌పై దాడికి పాల్పడటంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ నల్లప్ప గ్రామానికి చేరుకుని దాడిచేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

రుద్రవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచినేనిపల్లెకు చెందిన పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త విజయభాస్కర్, అత్తమామలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహ్మద్‌రఫి సోమవారం తెలిపారు. మాచినేనిపల్లెకు చెంది పద్మావతికి చాగలమర్రికి చెందిన విజయభాస్కర్‌కు 9 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

మహానంది, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహానంది సమీపంలోని పంట పొలాలకు వెళ్లే కాలువలో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందారు. వివరాలివీ.. బనగానపల్లె మండలంలోని కొత్తపేటకు చెందిన ఎరుకలి సుంకన్న(50) సోమవారం ఉదయం మహానందికి దర్శనానికి వచ్చారు. ఆలయ సమీపంలోని పంట పొలాలకు వెళ్లే కాలువ గట్టుపై కూర్చున్నారు. ఆసమయంలో మూర్ఛవ్యాధికి గురై కాలువలో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. సుంకన్న అప్పుడప్పుడు మూర్ఛవ్యాధికి వస్తుండేదని బంధువులు తెలిపారు. మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో స్వగ్రామానికి తరలించారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు ..

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన కౌలు రైతు చికిత్స పొందుతూ మృతి చెందారు. బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు తెలిపిన వివరాలివీ.. కోనేటమ్మపల్లెకు చెందిన కాటం సుధాకర్ (60) గ్రామంలో ఆరు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని మిరప, ఉల్లి, మొక్కజొన్న, పత్తి తదితర పంటు సాగుచేస్తూ జీవనం సాగించేవారు. 2020 నుంచి పంటలు దెబ్బతినడంతో దిగుబడి సరిగా లేక అప్పులు పెరిగాయి. దాదాపు రూ.15 లక్షలు అప్పు చేశారు. ఆ అప్పు ఎలా తీర్చాలోనని మనస్తాపం చెందేవారు. గతనెల 30న తెల్లవారుజామున ఇంటివద్ద పురుగుల మందు తాగారు. వాంతులు చేసుకుంటుండగా గమనించిన ఆయన భార్య నీలమ్మ, కుమారుడు గమనించి 108 వాహనం పిలిపించి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

ప్యాపిలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పులికొండ (33) వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. అనంతపురం జిల్లా గుత్తి మండలంకు చెందిన పులికొండ గత నెల స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొదుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్లపై విచారణ చేపట్టాలి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్పోర్ట్స్ నకిలీ సర్టిఫికెట్లను మంజూరు చేసిన అథ్లెటిక్ జిల్లా కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డీఎస్సీ 2025 ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిందన్నారు. స్పోర్ట్స్ కోటాలో ప్రత్యేకంగా ఉద్యోగాలు కేటాయించడంతో అథ్లెటిక్ జిల్లా కార్యదర్శి, కొంత మంది పీడీలు కలిసి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. జనార్దన్, వినయ్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల్లో గుబులు

- పెర్ఫార్మెన్స్ పేరుతో తొలగించేందుకు కుట్ర
- ఆర్‌యూలో రెండు రోజులుగా సాగిన రివ్యూ
- న్యాయస్థానాన్ని ఆశ్రయించిన అధ్యాపకులు

తాత్కాలిక అధ్యాపకులు యూనివర్సిటీల్లో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నో ఒడిదుడుకులు ఉన్నా నిబద్ధతతో బోధన కొనసాగిస్తున్నారు. ఇటీవలే ఎస్వీయూ, ఆర్‌యూ ల్లో చేపట్టిన పెర్ఫార్మెన్స్ రివ్యూలతో అధ్యాపకుల్లో గుబులు మొదలైంది. తమను విధుల నుంచి తొలగిస్తారా మదన పడుతున్నారు. కాగా ఈ రివ్యూలకు కొందరు హాజరు కాగా మరికొందరు కోర్టుకు వెళ్లారు. దీంతో ఆయా ఉద్యోగులపై ఉన్నతాధికారులు కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. అసలు రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడే రివ్యూలు నిర్వహించడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆయా యూనివర్సిటీల్లో పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకుల గుండెల్లో గుబులు మొదలైంది. పెర్ఫార్మెన్స్ పేరుతో తొలగించేందుకు కుట్ర జరుగుతోందని పలువురు ఆందోళన చెందుతున్నారు. రాయలసీమ యూనివర్సిటీలో జరిగిన రివ్యూకు కొందరు హాజరయ్యారు. మరి కొందరు అధ్యాపకులు కోర్టును ఆశ్రయించి రివ్యూకు హాజరు కాకపోవడం చర్చకు దారితీసింది. ఇటీవల ఎస్వీయూ(శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ)లో పెర్ఫామెన్స్ ఇంటర్వ్యూలు నిర్వహించి 43 మంది అధ్యాపకులను తొలగించిన విషయం ఇక్కడి అధ్యాపకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. గతనెల 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన పెర్ఫార్మెన్స్ తీరుపై అధ్యాపకులు తమను తొలగిస్తారా అంటూ చర్చించుకుంటున్నారు. న్యాయ స్థానాన్ని ఆశ్రయించిన ఉద్యోగులపైన ఉన్నతాధికారులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడు తున్నట్లు తెలిసింది. వారిపై తప్పులు వెతుకుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు వాపోతున్నారు.

ఎస్వీయూ, ఆర్‌యూలో మాత్రమే..

రాష్ట్రంలో ఏ యూనివర్సిటీ పెర్ఫార్మెన్స్ రివ్యూ ఇంటర్వ్యూ లను నిర్వహించడం లేదు. ఎస్వీయూ, రాయలసీమ యూనివర్సిటీ (ఆర్‌యూ)లు మాత్రమే ఎందుకు నిర్వహిస్తున్నా యని ఉద్యోగులు మండి పడుతున్నారు. గత ప్రభుత్వంలో అధికారుల వేదింపులతో కొంత మంది కాంట్రాక్టు అధ్యాప కులు విసిగిపోయారని, కూటమి ప్రభుత్వం వస్తే తమకు మంచి జరుగుతుందని టీడీపీ ప్రభుత్వానికి ఓటేస్తే కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసేందుకు..

పెర్ఫార్మెన్స్ రివ్యూ పైన కొంతమంది తాత్కాలిక ఉద్యోగులు త్వరలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. యూనివర్సిటీలో వైసీపీ భావజాలం ఉన్న ఉద్యోగులకే న్యాయం జరుగుతుందని, టీడీపీ భావజాలం ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని మరి కొందరు మండి పడుతున్నారు. . కూటమి ప్రభుత్వమే తమకు న్యాయంచేయాలని పలువురు అధ్యాపకులు వేడుకుంటున్నారు.

పెర్ఫార్మెన్స్ రివ్యూలు నిర్వహించం

ఉర్దూ యూనివర్సిటీలో పెర్ఫార్మెన్స్ రివ్యూలు నిర్వహించం. 14 మంది తాత్కాలిక అధ్యాపకులు ఏడేళ్లుగా పనిచేస్తున్నారు. పెర్ఫామెన్స్ రివ్యూ చేసి వాళ్ల జీవితాలను ఇబ్బంది పెట్టదలచుకోలేదు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంతో ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగాయి. ఉత్తమ ఫలితాలు వచ్చాయి. రాష్ట్ర స్థాయిలో ఉర్దూ యూనివర్సిటీకి మంచి భవిష్యత్తు ఉంది.

డాక్టర్ పీఎస్ షావలి ఖాన్, వీసీ, ఉర్దూ యూనివర్సిటీ, కర్నూలు

ఎవర్నీ తొలగించే ఆలోచనే లేదు

పెర్ఫామెన్స్ రివ్యూ ప్రతి ఏటా నిర్వహిస్తాం. ఏ అధ్యాపకుడిని తొలగించాలనే ఆలోచన మాకు లేదు. ఈరివ్యూతో అధ్యాపకుడు తన బోధన తీరును మరింత మెరుగు పరచుకునేందుకు అవకాశం ఉంటుంది. **- బోయ విజయకుమార్ నాయుడు, రిజిస్ట్రార్, ఆర్‌యూ, కర్నూలు**

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

● నగర పాలక కమిషనర్ విశ్వనాథ్



కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారం ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు, ఇంచార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, టీపీఆర్ఓ శ్రీనివాసులు, ఆర్ఓ జునైద్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎస్ఈపై కమిషనర్ ఆగ్రహం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరుకాకుండ ఎలాంటి సమాచారం ఇవ్వకుండ వెళ్లిన ఇంచార్జి ఎస్ఈ శేషసాయిపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం కిందిస్థాయి అధికారులనైనా వేదిక కార్యక్రమా నికి పంపకుండ ఎలా ఉంటారని ఫోన్‌లో అసహనం వ్యక్తం చేశారు. ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమానికి నగర పాలకలోని సెక్షన్ విభాగాల అధికారుల తోపాటు కిందిస్థాయి ఉద్యోగులు కూడా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

అర్జీల స్వీకరణ



ఓర్వకల్లులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

ఓర్వకల్లు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని తహసీల్దార్ విద్యాసాగర్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిం చారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు.

సి.బెళగల్: మండంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎంపీడీవోకు విన్నతి పత్రం అందజేశారు.

విజనరీ సీఎం చంద్రబాబు: గౌరు చరిత

కల్లూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విజనరీ సీఎం చంద్రబాబు అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సోమవారం మాధవీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రి అయ్యి నేటికి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గౌరు చరిత హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, ఎస్వీ రామకృష్ణ, బి.నాగిరెడ్డి, ఎస్‌కే. శ్రీనివాసరావు, పోలిరెడ్డి పాల్గొన్నారు.

తెలుగునేల గర్వించే నేత చంద్రబాబు: దస్తగిరి

కర్నూలు రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగునేల గర్వించే గొప్పనేత సీఎం చంద్ర బాబునాయుడు అని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. 1995 సెప్టెంబరు ఒకటో తేదీన తొలిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్థాయిలో బాధ్యతలు చేపట్టి నేటికి 30ఏళ్లు అవుతుందన్నారు. సీఎం హోదాలో 30ఏళ్లు పూర్తి చేసుకున్న చంద్రబాబుకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

కల్లూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. సోమవారం బస్తిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ గఫూర్ అధ్యక్షతన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు ఎస్. పుష్పరాజ్యం పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో డీఈవో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోపణలు సరికాదు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సుగాలి ప్రీతి అంశంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్పందించడం లేదంటూ వారి తల్లి పార్వతి ఆరోపించడం సరికాదని జనసేన పార్టీ కోడుమూరు ప్రతినిధి వెంకటరాముడు తెలిపారు. సోమవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. సుగాలి ప్రీతి మృతిపై గత ప్రభుత్వంలో సానుకూల స్పందన రాలేదని, ఈ అంశంలో పవన్‌కల్యాణ్ జోక్యం చేసుకుని పోరాటం చేయటం వల్లనే అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రీతి కుటుంబానికి ఇంటి స్థలం, పొలం, నష్టపరిహారం అందజేశాయని ఆయన గుర్తు చేశారు. మానవీయ కోణంలో చూడాల్సిన అంశాన్ని ప్రీతి తల్లి పార్వతి ఎవరో పోద్బలంతో రాజకీయ రంగు పులుమటం సమంజసం కాదన్నారు. ఇప్పటికి ఈ అంశంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆయన స్థాయిలో కేసును వేగంగా పరిష్కరిం చేందుకు కృషి చేస్తున్నారన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

గూడూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యకరంగా ఉంటారని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. సోమవారం మండలంలోని గుడిపాడు గ్రామంలో సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. డాక్టర్ రఘు మాట్లాడుతూ ఆరోగ్య , ఆశా కార్యకర్తలు గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, సామాజిక ఆరోగ్య అధికారి ఆనందమ్మ, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు ధర్మశేఖర్, మంగమ్మ, వెంకటేశ్వరమ్మ, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

మహిళలకు 'ఆడబిడ్డ నిధి' ఏదీ ?

వైసీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కళ్యాణి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో భాగంగా టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మహిళలకు ఆడబిడ్డ నిధి పథకం ఏమైందని వైసీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ప్రశ్నించారు. సోమవారం ఎస్వీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్సీ కల్పల తారెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయమనోహరి, పత్తి కొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక పాల్గొన్నారు.

మట్టి మిద్దెల వివరాలను సేకరించాలి

సి.బెళగల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు మండలంలోని గ్రామాల్లో కూలిపోయిన మట్టి మిద్దెల వివరాలను సేకరించాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి వీఆర్వోలను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె ఆయా గ్రామాల వీఆర్వోలతో సమావేశమయ్యారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను విచారణ చేసి రిపోర్టు అందజేయాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే గౌరు చరిత

● లక్ష్మీపురంలో పింఛన్లు పంపిణీ

కల్లూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సోమవారం 28వ వార్డు లక్ష్మీపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందులున్నా ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే పింఛన్ పెంపుతోపాటు, మెగా డీఎస్సీ, మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, ఉచిత బస్ ప్రయాణం, అన్నదాతా సుఖీభవ అమలు చేశారన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డి.రామాంజనేయులు, ఈవీ.రమణ, పుల్లారెడ్డి, మారెన్న, శివ, శేఖర్‌చౌదరి, దొడ్డిపాడు బాషా పాల్గొన్నారు.

● కల్లూరు అర్బన్ 31వ వార్డు రాఘవేంద్రనగర్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వై.నాగేశ్వర రావు పంపిణీ చేశారు. సోమవారం వార్డు ఇన్‌చార్జి శైలజాయాదవ్‌తో కలిసి ఆయన వృద్ధులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

సి.బెళగల్: అర్హులందరికీ పింఛన్లు అందజేస్తామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. సోమవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ అధ్యక్షతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీవో రాణెమ్మ, తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి, సింగిల్ విండో ప్రెసిడెంట్ తిమ్మప్ప, పౌలు, బాలాజీ వెంకటేశ్ పాల్గొన్నారు.

గూడూరు: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు జె సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని గుడిపాడు గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు, నీటి సంఘం అధ్యక్షుడు మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



లక్ష్మీపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత



బ్రాహ్మణదొడ్డిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

ఓర్వకల్లు: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వృద్ధులు, వికలాంగులకు వరమని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. సోమవారం ఓర్వకల్లులో వృద్ధులు, వికలాంగులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, స్వామిరెడ్డి, అబ్దుల్లా, కురువ నాగరాజు, అల్లాబాబు, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: సీఎం చంద్రబాబు పింఛన్ సొమ్ము పెంచి పేదల పెన్నిధిగా నిలిచారని టీడీపీ నాయకులు కొనియాడారు. వెంకటగిరి, వర్కూరు గ్రామాల్లో టీడీపీ మండల కన్వీనర్ రామక్రిష్టారెడ్డి పింఛన్లు అందజేశారు. లద్దగిరిలో గ్రామ అధ్యక్షుడు పట్టి మధు అధ్వర్యంలో పంపిణీ జరిగింది. క్రిష్ణాపురంలో జీడీపీ డబ్ల్యూయూఏ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, కోడుమూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ శంకరరెడ్డి లబ్ధిదారులకు అందించారు.

నెలకు రూ.12 వేలు ఇవ్వాలి

● కలెక్టరేట్ ఎదుట ఆటో కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో కార్మికులకు నెలకు రూ.12వేలు ఇవ్వాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆటో కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. విజయ రామాం జనేయులు మాట్లాడుతూ నగరంలో యువకులకు చదివిన చదువులకు ఉద్యో గాలు రాక ఆటోలు నడిపి ఉపాధి పొందుతున్నారన్నారు. కార్మికులకు ఉపాధి కోల్పోయే విధంగా స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం మంచిగా కనిపించిన ఆటో కార్మికుల ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. ఈ క్రమంలో వారి కుటుంబాలు ఆకలితో చావకుండ ఉండాలంటే నెలకు రూ.12 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర నాయకులు అబ్దుల్ దేశాయ్, నాగస్వాములు, రామక్రిష్ణ, ఆటో యూనియన్ నగర కార్యదర్శి మహ్మద్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కర్నూలు రూరల్ సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని మామిదాలపాడు గ్రామానికి చెందిన టి.భవ్యకు సోమవారం కోడుమూరు ఎమ్మెల్యే తన నివాసంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 1,45,000 నగదు చెక్కును అందజేశారు. భవ్య గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యానికి గురై ఆర్థిక పరిస్థితి కారణాలతో మెరుగైన వైద్యం చేయించుకోలేకపోయింది. స్థానికుల సహకారంతో కోడుమూరు ఎమ్మెల్యేను ఆశ్రయించగా ఆయన వెంటనే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ కింద నగుదును మంజూరు చేయించారు. ఈసందర్భంగా భవ్య ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి

కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ధర్నా

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉల్లి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి ధర్నా చేశారు. జగన్నాథం మాట్లాడుతూ గత రెండురోజులుగా మార్కెట్ యార్డులో ఉల్లికి గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల నుంచి వ్యాపారులు క్వింటం రూ.300 నుంచి రూ.600 వరకు కొనుగోలు చేసి బయట కిలో రూ.20 నుంచి రూ.25 వరకు అమ్ముతున్నారని అన్నారు. కార్యక్ర మంలో జిల్లా సహాయ కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు, నగర కార్యదర్శి రామక్రిష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి చింతల మహేష్ పాల్గొన్నారు.

నాగేశ్వరయ్యకు తెలుగుతేజం పురస్కారం



నాగేశ్వరయ్యను సత్కరిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన సాహితీవేత్త కోలుకొండ వీర నాగేశ్వరయ్యకు తెలుగు తేజం పురస్కారం లభించింది. గిడుగు రామమూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాలులో శ్రీశ్రీ కళావేదిక సంస్థ తెలుగు సాహిత్యంలో కృషి చేస్తున్న పలువురికి ఈ పురస్కారాలు అందజేసింది. కాగా జిల్లానుంచి ఈ పురస్కారానికి నాగేశ్వరయ్య ఎంపికయ్యారు. నాగేశ్వరయ్య మాట్లాడుతూ కాలాను గుణంగా జీవనోపాధికి ఏ భాషను నేర్చుకున్నా, అమ్మ భాషను మాత్రం మర్చిపోకూడదని తెలిపారు. ఈ పురస్కారానికి తనను ఎంపిక చేసిన శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరిభూషణం, పార్థసారధిలకు ధన్యవాదాలు తెలియజేశారు. నాగేశ్వరయ్యను కవులు, సాహిత్యాభిమానులు అభినందించారు.

జీవో 23ని రద్దు చేయండి

ఓర్వకల్లు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): టూరిజం సంస్థను ప్రైవేటుపరం చేయడం సరికాదని, తక్షణమే జీవో నెంబరు 23ని రద్దు చేయాలని పున్నమి రెస్టారెంటు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం కలెక్టర్ కార్యాల యం ఎదురుగా నిరసన చేపట్టారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సంద ర్భంగా నాయకులు బోసు, నాగరాజు, కీర్తిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, సరైన జీతభత్యాలు లేకపోయినా ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. నూతన జీవో నెంబర్ 23ని ప్రభుత్వం తెచ్చి ప్రైవేటు సంస్థకు అప్పగించేలా నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉల్లిని గ్రేడింగ్ చేసి అమ్మకానికి తెండి

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పండించే ఉల్లిని రైతులు తమ గ్రామాల్లోనే క్లినింగ్ చేసి కర్నూలు మార్కెట్ యార్డుకు అమ్మకానికి తీసుకురావాలని, దీంతో మంచి ధర లభిస్తుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు విజ్ఞప్తి చేశారు. సోమవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎటువంటి గ్రేడింగ్ చేయకుండా పక్వానికి రాక ముందే రైతులు అమ్మ కానికి కర్నూలు యార్డుకు తీసుకుని వస్తే తక్కువ ధర అందే ప్రమాదం ఉందన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

● కలెక్టర్‌కు జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడి వినతి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలో ఉల్చాల రోడ్డు నుంచి పెద్దపాడు వరకు గల రోడ్డు డివైడర్‌లో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాజు యాదవ్ కోరారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటో రియంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు.

● జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థులు ఇటీవల సీజనల్ వ్యాధులు బారిన పడి అనేక ఇబ్బందులకు గురవుతున్నారని రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్ కలెక్టర్‌ను కోరారు.

● ఆర్‌టీఈ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని రాయలసీమ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు, బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పగిడాల ఆనంద్‌బాబు, జేఏసీ నాయకులు సావడి రఘునాథ్, అఫ్రిది కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

● శిథిలావస్థకు చేరిన కల్లూరు వక్కెర వాగు బ్రిడ్జిని తొలగించి, కొత్తది నిర్మించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కలెక్టర్‌కు విన్నవించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ ఆనంద్ టాకీస్ వద్ద హంద్రీ బ్రిడ్జి కింద రోడ్డుపై ప్రవహిస్తున్న నీళ్లతో ప్రమా దాలు జరుగుతున్నాయన్నారు. బళ్లారి చౌరస్తా ఆంజనేయస్వామి గుడి పక్కన, ఆటోనగర్ వద్ద సర్వీసు రోడ్లపై పడ్డ గుంతలు పూడ్చాలని విన్నవించారు.

రక్ష హాస్పిటల్ గుర్తింపును రద్దు చేయాలి

కర్నూలు హాస్పిటల్: రక్ష హాస్పిటల్ గుర్తింపును రద్దు చేయాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న ఫిర్యాదు చేశారు. జూలై నెలలో నగరంలోని కొత్తబస్టాండు వద్ద ఉన్న రక్ష హాస్పిటల్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం వల్ల నంది కొట్కూరులో ఆర్ఎంపీ అబార్షన్ చేసి గర్భిణి ప్రాణాలు కోల్పో యిందని కలెక్టర్‌కు వివరించారు. ఈ ఘటన జరిగిన నెల రోజులు దాటిన జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమగ్ర విచారణ జరిపించాలి

గత నెల 30వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'పెద్దాసుపత్రిలో ఆధిపత్య పోరు' అన్న కథనంపై సమగ్ర విచారణ జరిపించాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిటికెల శామ్యూల్ సోమవారం కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ సరిగ్గా పర్యవేక్షించడం లేదని, అధికారుల మధ్య నిరంతరం ఘర్షణ వాతా వరణం నెలకొందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల ఇద్దరు అధికారుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయని, దీని ప్రభావం రోగులు, ఉద్యో గులు, వైద్యులపై పడిందన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల దరికి చేర్చండి: ఎంపీడీవో

కర్నూలు రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల దరికి చేర్చాలని కర్నూలు ఎంపీడీవో జి.రఘునాథ్ అధికా రులకు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీపీ సమావేశ భవనంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసమావేశానికి ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ అధ్యక్షత వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తంగా ఉండేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. మండల స్థాయి అధికారులు వారిశాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలను సమావేశంలో సభ్యులకు చదివి వినిపించారు. అందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన అంశాలను మండల ఆరోగ్యాశాఖ విస్తరణ అధికారి మగ్బుల్ సభ్యులకు వివరించారు. సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపిన నేటికి కూడా ఎంపీ టీసీ సభ్యులకు గౌరవ వేతనాలు ఇవ్వడంలేదని బి.తాండ్రపాడు ఎంపీటీసీ కురువ మద్ది లేటి సభాదృష్టికి తెచ్చారు. ఈసమావేశంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ను అమలు చేయాలి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నగర అధ్యక్షులు కాశన్న కోరారు. సీపీఎస్ అమలు పరిచిన రోజు బ్లాక్ డేగా గుర్తుగా సోమవారం భోజన విరామ సమయంలో ఏపీఎన్జీవోస్ అసోసియే షన్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బి.ప్రభాకర్ రెడ్డి, కర్నూలు నగర కార్యదర్శి ఎం.రామకృష్ణ, ఏపీ ప్రభుత్వ టైపిస్టు, స్టెనోగ్రాఫర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, జిల్లా ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బంగారి, మెడికల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ ఈశ్వరయ్య, జిల్లా సంయుక్త కార్యదర్శులు కేసీహెచ్ కృష్ణుడు, జనార్ధన్ రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గణేశ్ ఉత్సవాలు



సీ క్యాంపు సర్కిల్‌లో భారీ గణనాథుడు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ గణనాథుల విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేవానగర్, మద్దూర్ నగర్, టెలికాంనగర్, గుత్తి రోడ్, చెన్నమ్మ సర్కిల్, బళ్లారి రోడ్ తదితర ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథులకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిర్లా కాంపౌండ్‌లోని దేవానగర్ యూత్ కమిటీ సభ్యులు ఓసీఎం రంగా, కేవీ రమణ, సురేష్, రవి, మురళి, శరత్, తారాకేష్ తదితరులు ఏర్పాటుచేసిన ఆర్కెస్ట్రా ఆకట్టుకుంది.





బిర్లా కాంపౌండ్‌లోని దేవానగర్ యూత్ ఆధ్వర్యంలో గణనాథుడు



మున్సిపల్ స్థలం కబ్జా

(5వ పేజీ తరువాయి)

అయితే ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న అప్పటి మున్సిపల్ అధికారులు 2021లో అడ్డుకున్నారు. అలాగే కోర్టుకు సైతం వెళ్లాగా కోర్టు ఆదేశాలతో రెవెన్యూ శాఖ సర్వే చేసి మున్సిపల్ స్థలం అని తేల్చిందని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. దీన్ని ధిక్కరించి ఈ స్థలాన్ని విక్రయించేందుకు సదరు వైసీపీ నాయకుడు తన కూతురు పేరుపై ఉన్న స్థలం రిజిస్ట్రేషన్‌ను 2024లో తనపేరుపై జీపీఏ(జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) చేయించుకున్నాడు. ఏడాదిపాటు సైలెంటుగా ఉండి తిరిగి స్థలాన్ని విక్రయించేందుకు పావులు కదుపుతూ వచ్చాడు. ఈ ఏడాది జూలై 30వ తేదిన ఎమ్మిగనూరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 447/సీలో 400 చదరపు గజాలు(8సెంట్లు) స్థలాన్ని అనంతపురం జిల్లా గుత్తిపట్టణానికి చెందిన ఓ వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయించాడు. మున్సిపల్ స్థలాన్ని రిజిస్ట్రేన్ చేయకూడదని ఆదేశాలు ఉన్నప్పటికీ ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ వెనుక భారీగా ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ. కోట్ల విలువ చేసే స్థలం కేవలం రూ.18 లక్షలకే విక్రయించటం వెనుక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మున్సిపల్ అధికారులు నిరభ్యంతరం లేఖ ఇచ్చారు

2021లో మున్సిపాలిటీ 447/సిలో పార్కు స్థలం ఉందని రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ మున్సిపల్ అధికారులు లేఖ పంపారు. అయితే 2025లో మున్సిపాలిటీ పార్కు స్థలం కాదని నిరభ్యంతరం లేఖ ఇవ్వటంతో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ పూర్వపు పత్రాలు చూసి రిజిస్ట్రేషన్ చేశారు.

● శ్రీనివాసులు, సబ్ రిజిస్ట్రార్, ఎమ్మిగనూరు

ఇసుక.. తికమక..

- టీడీపీలో వర్గపోరుతో ఆగిన సరఫరా
- నిలిచిపోయిన ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలు
- పోలీసులు ఓ వర్గానికి వత్తాసు పలుకుతున్నారని వెల్లువెత్తుతున్న ఆరోపణలు

ఇసుక కొరతతో నిర్మాణాలు ఆగిపోకూడదని ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టింది. అయితే ఆలూరు నియోజకవర్గంలో టీడీపీ నాయకుల మధ్య వర్గ విభేదాలతో ఇసుక అందడం లేదు. పోలీసులు కూడా ఓ వర్గానికి వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్టర్లను సీజ్ చేసి, జరిమాన విధిస్తుండటంతో సరఫరా ఆగింది. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలను నిలిపివేశారు. ఇలా అయితే పనులు చేయలేమని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిలిచిపోయిన ఆలూరు కోర్టు భవన నిర్మాణం, ఇన్‌సెట్‌లో ముద్దనగేరి డ్రైనేజీ..

ఆలూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచిత ఇసుకను ప్రవేశపెట్టినా అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఆలూరు నియోజకవర్గంలో ఇసుక సరఫరా ఆగిపోయి ప్రభుత్వ నిర్మాణాలతో పాటు ప్రైవేటు నిర్మాణాలు కూడా ఆగిపోయాయి. ఆలూరు నియోజకవర్గం హాలహర్వి మండలంలోని నదీ పరివాహక ప్రాంతాలైన మార్లమడికి, సిద్ధాపురం, బల్లూరు, గూళ్యం గ్రామాల సమీపంలో, హొళగుంద మండలంలో మార్లమడికి వద్ద ఇసుక లభ్యం అవుతుంది.

రాజకీయ జోక్యం.. పోలీసుల ఆంక్షలు

అయితే అధికార పార్టీలోని రాజకీయ విబేధాలు ఇసుక సరఫరాకు అడ్డంకిగా మారాయి. నాయకుల ప్రోద్బలంతో పోలీసులు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి, భారీ జరిమానాలు విధిస్తున్నారు. దీంతో ఇసుకను సరఫరా చేసేందుకు ట్రాక్టర్ల యజమానులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక రీచ్ నుంచి 4 కి.మీ. మేర ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను తీసుకెళ్లవచ్చు. అయితే రాజకీయ విబేధాల కారణంగా సరఫరా ఆగిపోయింది. దీంతో ఆలూరులో రూ.3 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ అతిథి గృహం పనులు, కోర్టులో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న భవనంతో పాటు ఆలూరు - హొళగుంద రహదారి పనులు ఆగిపోయాయి.

పోలీసుల తీరుపై వీరభద్రగౌడ్ ఆరోపణలు

ఇసుక సరఫరాలో పోలీసుల తీరుపై టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ 15 రోజుల క్రితం ట్రాక్టర్ ర్యాలీ సందర్భంగా ఆరోపణలు చేశారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

ఇసుక కొరతపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు

ఆలూరు నియోజకవర్గంలో ఇసుక కొరతపై ఎమ్మెల్యే విరుపాక్షి కలెక్టర్ రంజిత్‌బాషాకు ఫిర్యాదు చేశారు. ఇసుక సరఫరాలో రాజకీయ ఒత్తిళ్లకు పోలీసులు తలొగ్గకుండా ఉచిత ఇసుక సరఫరాకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఉచిత ఇసుక సక్రమంగా అందేలా చూడాల్సి ఉంది.

ఉచిత ఇసుకను అడ్డుకోరాదు



ప్రభుత్వ నిబంధనల మేరకు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా ప్రజలే నేరుగా నది నుంచి తెచ్చుకోవచ్చు. ఉచిత ఇసుక సరఫరాను అడ్డుకోరాదు. ఎవరైనా అడ్డుకుంటే మాకు ఫిర్యాదు చేయండి **- విజయకుమార్, డీటీ, ఆలూరు.**

పనులు నిలిపివేశాం



ప్రభుత్వ భవన నిర్మాణాలకు ఇసుక సరఫరా కాకపోవడంతో పనులు నిలిపివేశాం. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని పక్కాగా అమలు చేయాలి. పనులకు బిల్లులు సకాలంలో రాకపోయినా పనులు చేస్తున్నాం. ఇసుక కొరత ఉంటే మేము పనులు చేయలేం. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. **- వి.ఏ.కె.చౌదరి, కాంట్రాక్టర్, ఆలూరు**

ఆదోనికి నిధులు కేటాయించాలి

- మంత్రి నారా లోకేశ్‌ను కోరిన ఎమ్మెల్యే పార్థసారథి


లోకేశ్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

ఆదోని, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెండో ముంబైగా పేరు గాంచిన ఆదోని అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మంత్రి లోకేశ్‌ను కోరినట్లు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. సోమవారం వినతి పత్రం సమర్పించానని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పీ4 అమలుపై సమూలంగా చర్చించామన్నారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతులకు రూ.45 కోట్లు, రోడ్ల విస్తరణకు రూ.52 కోట్లు, గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి రూ.42 కోట్లు, మార్కెట్ కమిటీ లింకు రోడ్ల కోసం రూ.6 కోట్లు నిధులు కేటాయించాలని కోరానన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

పండ్ల తోటలతో రైతుల అభివృద్ధి


రైతుకు మొక్క అందజేస్తున్న ఎంపీడీవో విశ్వమోహన్

తుగ్గలి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటలను పెంచితే రైతులు అభివృద్ధి చెందుతారని ఎంపీడీవో విశ్వమోహన్, ఏపీవో హేమసుందర్ పేర్కొన్నారు. సోమవారం తుగ్గలి ఏపీవో కార్యాలయం వద్ద రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. వంద శాతం సబ్సిడీతో మొక్కలు అందిచి, పెంచేందుకు కూలీ కూడా ప్రభుత్వం ఇస్తుందన్నారు. టీఏలు రాజశేఖర్, రామకృష్ణ, చంద్ర, సీనియర్ మేట్లు జయచంద్ర, అంజి తదితరులు ఉన్నారు.

ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్ననాయకులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంత ప్రధాన కేంద్రం ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి కాజా డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మెల్సీ బీటీ నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు.

చర్చి నిర్మాణానికి విరాళం


చెక్కు ఇస్తున్న నారాయణరెడ్డి

ఆలూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దనగేరి గ్రామంలో చర్చి నిర్మాణానికి తెలుగు రైతు సంఘం కార్యదర్శి నారాయణరెడ్డి, సోదరుడు శ్రీనివాస రెడ్డి రూ.50 వేలు సోమవారం విరాళం ఇచ్చారు. ఆరోగ్యస్వామి, అబ్రహం, దావీదు, థామస్, అంతయ్య కృతజ్ఞతలు తెలిపారు.

పోరాటం ఉధృతం చేస్తాం


పత్తికొండలో జెండా ఆవిష్కరిస్తున్న రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తే పోరాటం ఉధృతం చేస్తామని రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని కొండగేరిలో రైతుల కోర్కెల దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేశారు. వ్యవసాయరంగానికి బడ్జెట్‌లో నిధులు ఎక్కువగా కేటాయించి, రైతులను ఆదుకోవాలన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులరె అమలు చేసి రైతుల అప్పులను మాఫీ చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. సురేంద్రకుమార్, రామాంజినేయులు, ఖాపిం, ఎం.కె.సుంకన్న, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థి బస్సు నడపాలి

హొళగుంద, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నుంచి సులువాయి మీదుగా హొళగుందకు విద్యార్థి బస్సు నడపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ నిజాముద్దీన్‌కు వినతిపత్రం అందించారు. సులువాయి, సమ్మాతగేరి, మునానుగుంది గ్రామాల నుంచి 100 మందికిపైగా విద్యార్థులు హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వస్తున్నామని విద్యార్థి బస్సు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదన్నారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్


అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో డివిజన్‌లోని ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించాలని సూచించారు. సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌పీవో తిమ్మక్క, డీఎల్‌డీవో బాలకృష్ణారెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ షఫీవుల్లా, హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్, ఏడీఈ బాలవర్ధిరాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభరెడ్డి, ఏవో రమాదేవి పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనపై ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్ నగర్, మరాఠీ వాడి ప్రాంతాల్లో సోమవారం వైద్యాధికారి శేఖన్ బాను ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. టీబీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సూపర్‌వైజర్ బాబురాజు, ఏఎన్ఎం పద్మావతి ఉన్నారు.

మున్సిపల్ స్థలం కబ్జా

(5వ పేజీ తరువాయి)

అయితే ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న అప్పటి మున్సిపల్ అధికారులు 2021లో అడ్డుకున్నారు. అలాగే కోర్టుకు సైతం వెళ్లాగా కోర్టు ఆదేశాలతో రెవెన్యూ శాఖ సర్వే చేసి మున్సిపల్ స్థలం అని తేల్చిందని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. దీన్ని ధిక్కరించి ఈ స్థలాన్ని విక్రయించేందుకు సదరు వైసీపీ నాయకుడు తన కూతురు పేరుపై ఉన్న స్థలం రిజిస్ట్రేషన్‌ను 2024లో తనపేరుపై జీపీఏ(జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) చేయించుకున్నాడు. ఏడాదిపాటు సైలెంటుగా ఉండి తిరిగి స్థలాన్ని విక్రయించేందుకు పావులు కదుపుతూ వచ్చాడు. ఈ ఏడాది జూలై 30వ తేదిన ఎమ్మిగనూరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 447/సీలో 400 చదరపు గజాలు(8సెంట్లు) స్థలాన్ని అనంతపురం జిల్లా గుత్తిపట్టణానికి చెందిన ఓ వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయించాడు. మున్సిపల్ స్థలాన్ని రిజిస్ట్రేన్ చేయకూడదని ఆదేశాలు ఉన్నప్పటికీ ఎమ్మిగనూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ వెనుక భారీగా ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ. కోట్ల విలువ చేసే స్థలం కేవలం రూ.18 లక్షలకే విక్రయించటం వెనుక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా ఈ స్థలం రిజిస్ట్రేషన్‌పై మున్సిపల్ అధికారులు, రిజిస్ట్రేషన్ అధికారులు వింతవాదనలు చేస్తుండటం గమనార్హం. రూ. కోట్ల విలువచేసే స్థలాన్ని మున్సిపల్ అధికారులు గాలికొదిలేయటం పట్ల పట్టణవాసులు మండిపడుతున్నారు.


దాదాపు రూ. 2కోట్లకు పైగా విలువచేసే స్థలం పార్కు స్థలం

విచారించి చర్యలు తీసుకుంటాం



పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలో 447/సీలో 42సెంట్ల స్థలం ఉంది. అందులో బోరు ఏర్పాటు చేశాం. ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయవద్దని గతంలో సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ పంపించాం. ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకుంటే దాన్ని రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ స్థలం రిజిస్ట్రేషన్ చేయవద్దని, అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుని ఉంటే రద్దు చేయాలని శుక్రవారం కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్‌కు, ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్‌కు లేఖలు పంపించాం. విచారించి చర్యలు తీసుకుంటాం.
- గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

మున్సిపల్ అధికారులు నిరభ్యంతరం లేఖ ఇచ్చారు



2021లో మున్సిపాలిటీ 447/సిలో పార్కు స్థలం ఉందని రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ మున్సిపల్ అధికారులు లేఖ పంపారు. అయితే 2025లో మున్సిపాలిటీ పార్కు స్థలం కాదని నిరభ్యంతరం లేఖ ఇవ్వటంతో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ పూర్వపు పత్రాలు చూసి రిజిస్ట్రేషన్ చేశారు.
- సబ్ రిజిస్ట్రార్, శ్రీనివాసులు, ఎమ్మిగనూరు

ఉల్లి రైతులను ఆదుకోండి


తహసీల్దార్ గూండాల్ నాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మద్దికెర, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల నుంచి ఉల్లిని క్వింటం రూ.3వేల ప్రకారం కొనుగోలు చేయాలని సీపీఐ కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి మదనంతపురం హనుమన్న, పెరవలి సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న రూ.1,200లు గిట్టుబాటు కాదన్నారు. అనంతరం తహసీల్దార్ గూండాల్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వరి పంట రూ.500లు బోనస్ ఇవ్వాలన్నారు. నాగిరెడ్డి, బొజ్జన్న, రామాంజులు ఉన్నారు.

పత్తికొండ టౌన్: ప్రభుత్వం ఉల్లిని క్వింటం రూ.3వేల ప్రకారం కొనుగోలు చేయాలని రైతు సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సురేంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఉల్లి రైతులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం వద్ద ఉల్లిని పారబోసి నిరసన తెలియజేశారు. మార్కెటింగ్‌శాఖ అధికారులు క్వింటానికి రూ.1,200 చొప్పున కొనుగోలు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ ఉసేన్‌సాబ్‌కు వినతి పత్రం అందించారు. సిద్ధలింగప్ప, పెద్దముని, నెట్టికంటయ్య, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

క్వింటా ఉల్లికి రూ.2వేలు ఇవ్వాలి

దేవనకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉల్లికి క్వింటం రూ.2 వేలు మద్దతు ధర ఇవ్వాలని సీపీఎం నాయకులు వీరశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్యాలయం వద్ద ఆందోళన చేసి ఏవో ఉషారాణికి వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.1,200లు సరిపోవని, తక్షణమే రూ.2 ఇవ్వాలని కోరారు. యూసుఫ్ బాషా, మహేంద్ర, నాగేంద్ర, రాముడు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

ఆలూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ ఆంజనేయులు యృతదేహానికి ఎమ్మెల్యే విరుపాక్షి, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ సోమవారం నివాళి అర్పించారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కురువ జయరాం, జడ్పీటీసీ శేఖర్, మాజీ జెడ్పీటీసీ రాంభీంనాయుడు ఉన్నారు.

పంట నమోదు చేయాలి

మద్దికెర, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉల్లి సాగు చేసిన రైతులు పంట నమోదు చేసుకోవాలని ఏవో రవి సూచించారు. సోమవారం మాట్లాడుతూ ఉల్లికి ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించిందని, మార్కెట్ యార్డుకు తీసుకెళ్లే ఆరబెట్టి నాణ్యమైన ఉల్లిని తీసుకెళ్లాలన్నారు. ఈకేవైసీ ఉంటేనే కొనుగోలు చేస్తారని, లేకపోతే కొనుగోలు చేయరనీ తెలిపారు.

కాపర్ వైరు చోరీ

దేవనకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్నూలు-బళ్లారి రహదారిపై గద్దెరాళ్ల బస్‌స్టేజీ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ ఆయిల్ చోరికి గురైంది. కొందరు దుండగులు ఆదివారం రాత్రి ట్రాన్స్‌పార్మర్‌ను తాళ్లసాయంతో వేరు చేసి, దాదాపు రూ.8 వేలు విలువ చేసే ఆయిల్ నేలపాలు చేశారు. అనంతరం రూ.20 వేలు విలువ చేసే 30 కేజీల వైరును ఎత్తుకెళ్లారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ రవీంద్ర తెలిపారు.

చెరువు మరమ్మతులపై సీఎంతో మాట్లాడతా

- చెరువును పరిశీలించిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు


చెరువు పగుళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు

ఆదోని టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బసాపురం చెరువుకు శాశ్వత మరమ్మతులు చేసేందుకు రూ.70 కోట్ల నిధుల మంజూరు చేయాలని సీఎం చంద్రబాబుతో మాట్లాడతానని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. సోమవారం చైర్‌పర్సన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణతో కలిసి చెరువుకు ఏర్పడ్డ పగుళ్లను పరిశీలించారు. మరమ్మతుల వివరాలను డీఈ వెంకట చలపతి వివరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈ నెలలో కర్నూలుకు వస్తున్న జిల్లా మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లానన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే డా.పార్థసారథితో కలిసి సీఎంకు వివరిస్తామన్నారు. డీఈ రామమూర్తి ఉన్నారు

మూడు దశాబ్దాల చంద్రన్న యాత్ర

ఆదోని: సీఎం చంద్రబాబు నాలుగుసార్లు సీఎంగా పనిచేసే మూడు దశాబ్దాల యాత్ర చేసినట్లు ఎమ్మెల్సీ బి.టి.నాయుడు పేర్కొన్నారు. సోమవారం మాట్లాడుతూ చంద్రబాబు పాలన రాష్ట్ర చరిత్రలో మైలురాయి అని, ప్రజల వద్దకు పాలన తీసుకెళ్లిన నాయకుడన్నారు. రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక, సాంకేతిక అభివృద్ధికి ఆయన కృషి అమూల్యమన్నారు. హైటెక్ సిటీ నిర్మాణం విజన్ 2020 నాలెడ్జ్ ఎకనామీ ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ మ్యాప్‌పై నిలిపారన్నారు. ఉపాధ్యాయుల నియామకం, విద్య, వైద్య రంగాలను విస్తృతంగా అభివృద్ధి చేశారన్నారు. నదుల అనుసంధానం, అన్నా క్యాటీన్లు, రియల్ టైం గవర్నెన్స్ అమరావతి నిర్మాణం నిర్ణయాలు ఆయన ఆలోచనలకు ప్రతిబింబించాయన్నారు.

చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షం


మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని 4వ వార్డులో పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం కార్యాలయంలో మాట్లాడుతూ 30 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో చంద్రబాబుకు ప్రజా సమస్యలు, రాష్ట్రాభివృద్ధిపై పూర్తి స్థాయిలో అవగాహన ఉందన్నారు. కన్వీనర్ అశోక్, నరసప్ప, కొమ్ము రామాంజినేయులు, హరిరెడ్డి, గుండన్న, రాముయాదవ్ ఉన్నారు.

పింఛన్లపై వైసీపీ ఆరోపణలు అసత్యం : ఎంపీ


దేవనకొండలో పింఛన్ ఇస్తున్న ఎంపీ నాగరాజు

దేవనకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పింఛన్లు రద్దు చేశారని వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలు అసత్యమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. సోమవారం దేవనకొండలోని బీసీ కాలనీలో డయాలసిస్, దివ్యాంగుల పింఛన్లను పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడలేని విధంగా అధిక పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, ఇది సీఎం చంద్రబాబుకే సాధ్యమన్నారు. ఎంపీడీవో జ్యోతి, డిప్యూటీ ఎంపీడీవో గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సప్తభజన


భారీ పుష్పాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఆలూరు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెద్దహోతూరు గ్రామంలో ఉచ్చీరప్పతాత ఆలయంలో సప్తభజన కొన సాగుతోంది. సోమవారం ఉదయం పంచామృతాభిషేకం, కుంకు మార్చన, మహామంగళహారతి నిర్వహించినట్లు పీఠాధిపతి చంద్రమౌళి, అర్చకుడు సిద్ధయ్యస్వామి తెలిపారు. సాయంత్రం వివిధ రకాల పుష్పాలు, గజమాలతో అలంకరణ చేసి, పుష్పాలదొడ్డి కురువ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిచారని తెలిపారు. హనుమంతు, ఆంజనేయ, గోవిందు, అంజనికుమార్ పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలకు నిధులు ఇవ్వండి

ఆస్పరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జడ్పీ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి, అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని చిగిలి సర్పంచ్ రాధాకృష్ణ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఆగస్టు 22న ఆరు మంది విద్యార్థులు పడి మృతిచెందారని, కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

ఉల్లికి మద్దతు ధర కల్పించాలి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రామచంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి మెడకు ఉరితాళ్లు కట్టుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎన్నికల డీటీ వలికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, సహాయ కార్యదర్శి రంగన్న, కేసీ జబ్బార్, మాలిక్, శాంతప్ప, రాజీవ్, విజయేంద్ర, తిమ్మగురుడు, మల్లికార్జునగౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాపాలన

కౌతాళం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోందని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్పగౌడ్ అన్నారు. మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తుండటంతో ఇది ప్రజాపాలన అని ప్రజలే అంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి నెల 1న పింఛన్ల పండుగలా సంబరాలు జరుపుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్ని సమస్యలు ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పింఛన్లను మాత్రం 1వ తేదీనే అందిస్తూ దేశంలో ఆదర్శ సీఎంగా నిలిచారన్నారు. గత ప్రభుత్వంలో దొంగ సర్టిఫికెట్లతో వికలాంగుల పింఛన్లు పొందారని కూటమి ప్రభుత్వంలో అలాంటివి గుర్తించి రద్దు చేయడంతో వికలాంగులను మోసం చేసిందని దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. అనంతరం పింఛన్‌దారులకు సచివాలయ ఉద్యోగులతో కలిసి పింఛన్ పంపిణీ చేశారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు

కౌతాళం,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒకటైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం నందు సోమవారం భక్తులతో సందడిగా మారింది. సోమవారం స్వామి వారం కావడంతో దేవాలయం నందు అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామునే శుద్ధజలంచే పూజించి ప్రత్యేక పుష్పాల తో ఆలంకరించి మహామంగళహారతితో పూజించి భక్తులకు దర్శనం కల్పించారు. దర్శనంకు వచ్చిన భక్తులకు ఆలయ డిప్యూటీ కమీషనర్ వాణి ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

దరఖాస్తుల పరిశీలన

కౌతాళం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రతమైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయమునకు పాలక మండలి ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తులను ఈ నెల 4న పరిశీలన చేస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో వాణి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దేవాలయ పాలక మండలి ఏర్పాటుకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించగా ఆసక్తి గల అభ్యర్థులు ఇటీవల దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తుదారులు దరఖాస్తులలో తెలిపిన వివరాలు వ్యక్తిగత వివరాలను తెలుపుటకు ఈనెల 4న దేవస్థానం కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు హాజరు కావాలని తెలిపారు. దరఖాస్తుదారులు పరిశీలనకు వచ్చు సమయంలో తమ ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, పోలీస్ స్టేషన్ నుంచి ఎన్‌వోసీ, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత పత్రం, కోర్టు ఆఫిడవిట్ పత్రాలు ఒరిజినల్స్‌తో హాజరు కావాలని తెలిపారు.

దొంగతనానికి వెళ్లి దొరికిపోయారు

కోసిగి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా దొంగతనాలకు అలవాటు పడిన కోసిగి, పెద్దకడుబూరు గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా ఎరిగేరి తాలుకా దేవనపల్లిలో గొర్రెలు దొంగతనం చేస్తూ గ్రామస్థులకు పట్టుబడ్డారు. కోసిగి 3వ వార్డు చెందిన ఈరేష్ పెద్దకడుబూరు మండలం బాపలదొడ్డి గ్రామానికి చెందిన జయకృష్ణ, పెద్దకడుబూరు మండలం బసలదొడ్డి గ్రామానికి చెందిన అంజి గొర్రెల దొంగతనానికి వెళ్లి దేవనపల్లి గ్రామస్థులకు పట్టుబడ్డారు. గ్రామస్థులు వారికి దేహశుద్ధి చేసి రాత్రంతా గ్రామంలో యువకులను చెట్టుకు కట్టేసి సోమవారం ఉదయం ఎరిగేరి పోలీసులకు గ్రామ పెద్దలు వారిని అప్పగించారు. అయితే కొందరు స్థానికంగా ఉండే వైసీపీ నాయకులు కర్ణాటక పోలీసులపై ఒత్తిడి తెచ్చి వారిని బయటకు తెచ్చారు. వీరిపై కేసు నమోదు చేయకుండా పోలీసులు పంపించడంపై దేవనపల్లి గ్రామస్థులు కర్ణాటక పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరిని బంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది

ఇద్దరికి తీవ్ర గాయాలు

మంత్రాలయం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నహల్లి గ్రామ సమీపంలో మంత్రాలయం నుంచి వస్తున్న కారు ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ రోడ్డు ప్రమాదం సోమవారం రాత్రి జరిగింది. మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాల మేరకు మంత్రాలయం చెందిన తెలుగు రఘు, తెలుగు అంజి మాధవరం నుంచి మోటారు సైకిల్‌పై సొంత గ్రామానికి వస్తుండగా.. మంత్రాలయం నుంచి మాధవరం వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108 అంబులెన్స్ ద్వారా ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. మోటారు సైకిల్ ఢీకొట్టిన కారును గుర్తించేందుకు మాధవరం రోడ్డులో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి కారును గుర్తిస్తామని ఎస్ఐ శివాంజల్ తెలిపారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. బాధితుల బంధువులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దేశం గర్వించదగ్గ సీఎం చంద్రబాబు నాయుడు


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): యావత్ భారతదేశం గర్వించదగ్గ సీఎం చంద్ర బాబు నాయుడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. ఎమ్మిగనూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టి 30ఏళ్లు పూర్తికావటం హర్షణీయమన్నారు. ఆధునిక ఆంధ్రప్రదేశ్‌కు బలమైన పునాది వేశారన్నారు. చంద్రబాబు హయాంలో డ్వాక్రా సంఘాలు పెట్టి ఎంతో మంది మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేశారన్నారు. అలాగే హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మించి ఐటీ విప్లవానికి నాందిపలికారన్నారు. ప్రపంచం ఆంధ్రప్రశ్‌వైపు చూసేలా అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు భరద్వాజశెట్టి, ఇంద్రసేనా రెడ్డి, వీరారెడ్డి, నరసింహులు, కృష్ణారెడ్డి, నీలకంఠరెడ్డి, రామయ్య, సల్మాన్ రాజు పాల్గొన్నారు.

గోనెగండ్లలో పారిశుధ్య పనులు

గోనెగండ్ల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో గత నాలుగు రోజులుగా పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపడుతున్నారు. డెంగీ, మలేరియా, తదితర వాధ్యులు ప్రబల కుండా ముందుజాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.

వైసీపీ పాపం.. ప్రజలకు శాపం

● చెరువుల్లోకి నీరు వెళ్లకుండా అడ్డుకట్ట ● నాయకుల తీరుతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


నిలిచిన నీటిలో ప్రమాదకరంగా వెళ్తున్న ఆటో


ప్రధాన రోడ్డుపై మోకాల్లోతు నిలిచిన వర్షపు నీరు

కోసిగి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలోని బుగేని చెరువులోకి తిమ్మప్పకొండ, బసవన్న, రంగప్ప కొండల నుంచి వాగులు, వంకల నుంచి బుగేని చెరువులోకి వర్షం నీరు చేరి వర్షాకాలంలో చెరువు నిండేది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బుగేని చెరువును తాగునీటి చెరువుగా చేస్తామని చెప్పి రూ.లక్షల డబ్బును వృథా చేసి నేడు వర్షం నీరు చెరువులోకి వెళ్లకుండా అడ్డుకట్టలు వేయడంతో ప్రధాన రోడ్లపై నీరు చేరి వాహనదారులకు రైతులకు ప్రజలకు వైసీపీ నాయకులు చేసిన పాపం ప్రజలకు శాపమైంది. చెరువులోకి వెళ్లే నీరుకు మట్టికట్టలు అడ్డు వేయడంతో రంగప్పగట్టు సమీపంలోని చింతకుంట, పల్లెపాడుకు వెళ్లే ప్రధాన రోడ్డులో మోకాల్లోతు నీరు నిలిచిపోవడంతో బైకులు, వాహనాలు వెళ్లక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అడ్డుగా ఉన్న మట్టికట్టలను తొలగించి నీరు చెరువులోకి వెళ్లే విధంగా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే నీరు వెళ్లే పైపులైన్లను సైతం మూసి వేయడంతో నీరు ప్రధానరోడ్డుపై నిల్వగా ఉండి వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

అడ్డుకట్ట వేశారు



గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులు చెరువులోకి వెళ్లే నీటిని రానీయ కుండా బుగేని చెరువు వద్ద మట్టికట్టలు అడ్డు వేయడంతో ఆ నీరు రోడ్డుపైనే నిల్వగా చేరి బైకులు ముందుకు వెళ్లకుండా ప్రమాదకరంగా ఉంది. వైసీపీ నాయకులు ఎన్నికల సమయంలో కావాలనే ఇలా చేశారు.

నల్లనగేని నర్సన్న, కోసిగి

వర్షపు నీరు చెరువులోకి వెళ్లేందుకు ఏర్పాటు చేస్తాం

వర్షం నీరు బుగేని చెరువులోకి వెళ్లకుండా గతంలో అడ్డుకట్టలు వేయడంతో వర్షం నీరు రోడ్డుపైనే నిలిచిపోయింది. ఇప్పుడు ఆ కట్టలను తొలగించి యథావిధిగా వర్షం నీరు బుగేని చెరువులోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తాం. ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం

- ఫణికుమార్, మైనర్ ఇరిగేషన్ ఏఈ, కోసిగి

ఇబ్బందులు పడుతున్నాం



పల్లెపాడు గ్రామాల ప్రజలు ఈ రోడ్డు గుండా వెళ్తుంటారు. నీరు మోకాల్లోతు ఉండటంతో బడులకు వెళ్లే విద్యార్థులు, రైతులు, ద్విచక్రవాహనదారులు ఇటు వైపు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు కింద పడి గాయాలపాలయ్యారు. సమస్యను పరిష్కరించాలి.

- గవిగట్టు వీరయ్య, రైతు, చింతకుంట

హైస్కూల్‌లో చోరీ


తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

కౌతాళం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌతాళం సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాఠశాలలో ఇటీవల కంప్యూటర్ ల్యాబ్ మంజూరుకాగా వాటికి సంబంధించిన పరికరాలు ఒక గదిలో ఉంచి శనివారం ల్యాబ్ ఇన్‌చార్జి రాము తాళం వేసుకుని ఆదివారం సెలవు కావడంతో స్వగ్రామానికి వెళ్లారు. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చి ల్యాబ్‌కు వెళ్లగా ల్యాబ్ తలుపులు పగలగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా ల్యాబ్‌లో కొన్ని వస్తువులను దుండగులు ధ్వంసం చేసిన అనవాళ్లు కనిపించాయి. మరి కొన్ని విలువైన పరికరాలు కనిపించకపోవడంతో ఈ విషయాన్ని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ దృష్టికి తీసుకుపోగా జరిగిన సంఘటనను కౌతాళం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన విలువైన పరికరాలు, ధ్వంసమైన పరికరాల విలువ దాదాపు రూ.2లక్షల వరకు ఉండవచ్చు. చోరీ జరిగిన ప్రదేశాన్ని సీఐ అశోక్ కుమార్ కర్నూలు నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే కేసును ఛేదిస్తామని సీఐ తెలిపారు.

ప్రహ్లాదరాయల వెండి రథోత్సవం


వెండి రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం బాద్రపద నవమి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనాన్ని బంగారు, వెండి, పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణబోధపూజ మందిరంలో ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. పీఠాధిపతి స్వహస్తాలచే మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. అనంతరం ఊంజల మంటపంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఊంజలసేవ నిర్వహించారు.వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ప్రహ్లాదరాయలకు బంగారు గొలుసు విరాళం :మైసూరుకు చెందిన రాధ అనే భక్తురాలు ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు 11గ్రాములతో తయారు చేయించిన బంగారు గొలుసును విరాళంగా ఇచ్చారు. సోమవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని బంగారు గొలుసును పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులకు అందచేశారు.విరాళం ఇచ్చిన గొలుసును రాఘవరాయుడి బృందావనానికి స్పర్శ చేసి అక్కడే అలంకృతుడైన ప్రహ్లాదరాయలకు పీఠాధిపతి అలంకరణ చేశారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం ,ఫల, పుష్ప, మంత్రాక్షితలు,పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక రుద్రాభిషేకం: మంత్రాలయం పుణ్యక్షేత్రంలో శ్రీరాముని స్వహస్తాలతో ప్రతిష్ఠించిన రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సోమవారం ఆలయ అర్చకులు వీరభద్రస్వామి, సిద్ధలింగయ్య స్వాములు రామలింగేశ్వరునికి జలాభిషేకం, రుద్రాభిషేకం, విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం చందనం, విభూతి, గరిక మారేడు దళాలతో పాటు పలు రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య స్వామివారికి హారతులు ఇచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజలు ప్రశ్నించాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించడంపై ప్రజలు ప్రశ్నించాలని వైసీపీ పట్టణ అధ్యక్షుడు నాగేషప్ప అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని 11,12వ వార్డులో జరిగిన బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో నాగేషప్ప, షాబుద్దీన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై మౌనాన్ని, అమలులోని నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలలో ఒక్క దాన్ని కూడా అమలు చేయని ప్రభుత్వం నేడు సుపరిపాలన - తొలి అడుగు అంటూ మరో మోసం ప్రారంభించిందని తీవ్రంగా మండిపడ్డారు. ఇది తొలి అడుగు కాదు - చంద్ర బాబు రాజకీయ జీవితం చివరి అడుగు అని అన్నారు. ముస్లీం మైనార్టిల సంక్షేమం విషయంలో తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారని పెర్కోన్నారు. బలహీన వర్గాలపై కక్షసాధింపులు, స్థానిక అభివృద్ధిపై అటంకాలు ఇవన్నీ కూటమి ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి నిదర్శనాలని పెర్కోన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహులు, వైస్ చైర్మన్ నజీర్, మైనార్టీ అధ్యక్షుడు ఖాశీం బేగ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సీజ్ చేయాలి


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రాష్ట్ర నాయకులు

నందవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నందవరంలోని ఓ పాఠశాలను సీజ్ చేయాలని విద్యార్థి సంఘం జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు, ఆర్‌యూ ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షాహిద్, అఫ్రీద్, బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అనందబాబు డిమాండ్ చేశారు.సోమవారం కర్నూలులో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. ఫీజులకోసం విద్యార్థులను వేదిస్తున్నారని ఆరోపించారు. వెంటనే పాఠశాలను తనిఖీ చేసి సీజ్ చేయాలని కోరారు.

చంద్రబాబుతోనే సంక్షేమం సాధ్యం


పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి

మంత్రాలయం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేయాలంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సింగరాజనహళ్లి గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్‌ఎం గోపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆర్ లక్ష్మయ్య, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. అనంతరం రాఘవేంద్ర రెడ్డితో పాటు నాయకులకు శాలువా పూలమాలతో సింగరాజనహళ్లి టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. జగన్ రెడ్డి చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ఎల్‌ఎల్‌సీ కాలువ చైర్మన్ చంద్ర, నరసింహులు, సింగిల్ విండో డైరెక్టర్ లక్ష్మన్న, నగేష్, ఈరన్న, గోపాల్, వీరారెడ్డి, రంగప్ప, రామలింగప్ప, లక్ష్మన్న, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

రైతాంగాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

గోనెగండ్ల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి):రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని ఎమ్మిగనూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఖాసీంవలి, ఎన్‌ఎస్‌యూఐ(నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా) జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ అన్నారు. సోమవారం గోనెగండ్ల మండల పరిధిలోని ఉల్లి రైతు పోలాలను కాంగ్రెస్‌పార్టీ నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో గోనెగండ్ల కాంగ్రెస్ నాయకులు ముల్లా ఖాశీంవలి, వోబీసీ నాయకులు శేషాద్రి, యువజన కాంగ్రెస్ నాయకులు షాకీర్, భాస్కర్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం


పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి


ఎంఎస్ నగర్‌లో సీసీరోడ్డు వేయాలని మున్సిపల్ అధికారులను సూచిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీఎంగా ఎంపికైన 30 ఏళ్ల నాటి నుంచి నేటి వరకు చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంఎస్ నగర్‌లో పింఛన్ లబ్దిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 30ఏళ్ల క్రితం చంద్రబాబు నాయుడు సీఎంగా ప్రమాణం చేయటం రాష్ట్ర రాజకీయాల్లో ఒక చరిత్ర అని అన్నారు. చంద్రబాబు హాయంలో పేదలకు సంబందించిన ఎన్నో సంక్షేమపథకాలు అమలు చేశారన్నారు. ఐటీ విప్లవానికి శ్రీకారం చుట్టి, విద్యా, వైద్యరంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ మల్లయ్య, నాయకులు దేవేంద్ర, వెంకటేశ్, ముల్లా కలీముల్లా, రామకృష్ణ నాయుడు, అంబేడ్కర్, శేఖర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి మంజూరైన రూ. 6,97,498ల చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అందజేశారు. ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులు పట్టణానికి చెందిన మానస, గోనేగండ్లకు చెందిన ఖాదర్‌బాషా కుటుంబ సభ్యులకు, పట్టణానికి చెందిన ఫయాజ్ అహ్మద్‌కు, ఇంద్రావతికి, కటికే మహ్మద్ గౌస్‌లకు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

మున్సిపల్ స్థలం కబ్జా

(5వ పేజీ తరువాయి)

అయితే ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న అప్పటి మున్సిపల్ అధికారులు 2021లో అడ్డుకున్నారు. అలాగే కోర్టుకు సైతం వెళ్లగా కోర్టు ఆదేశాలతో రెవెన్యూ శాఖ సర్వే చేసి మున్సిపల్ స్థలం అని తేల్చిందని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. దీన్ని ధిక్కరించి ఈ స్థలాన్ని విక్రయించేందుకు సదరు వైసీపీ నాయకుడు తన కూతురు పేరుపై ఉన్న స్థలం రిజిస్ట్రేషన్‌ను 2024లో తనపేరుపై జీపీఏ(జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) చేయించుకున్నాడు. ఏడాదిపాటు సైలెంటుగా ఉండి తిరిగి స్థలాన్ని విక్రయించేందుకు పావులు కదుపుతూ వచ్చాడు. ఈ ఏడాది జూలై 30వ తేదిన ఎమ్మిగనూరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 447/సీలో 400 చదరపు గజాలు(8సెంట్లు) స్థలాన్ని అనంతపురం జిల్లా గుత్తిపట్టణానికి చెందిన ఓ వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయించాడు. మున్సిపల్ స్థలాన్ని రిజిస్ట్రేన్ చేయకూడదని ఆదేశాలు ఉన్నప్పటికీ ఎమ్మిగనూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ వెనుక భారీగా ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ. కోట్ల విలువ చేసే స్థలం కేవలం రూ.18 లక్షలకే విక్రయించటం వెనుక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా ఈ స్థలం రిజిస్ట్రేషన్‌పై మున్సిపల్ అధికారులు, రిజిస్ట్రేషన్ అధికారులు వింతవాదనలు చేస్తుండటం గమనార్హం. రూ. కోట్ల విలువచేసే స్థలాన్ని మున్సిపల్ అధికారులు గాలికొదిలేయటం పట్ల పట్టణవాసులు మండిపడుతున్నారు.


దాదాపు రూ.2కోట్లకు పైగా విలువచేసే స్థలం పార్కు స్థలం

విచారించి చర్యలు తీసుకుంటాం



పట్టణంలోని ఎస్‌ఎంటీ కాలనీలో 447/సీలో 42సెంట్ల స్థలం ఉంది. అందులో బోరు ఏర్పాటు చేశాం. ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయవద్దని గతంలో సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ పంపించాం. ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకుంటే దాన్ని రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ స్థలం రిజిస్ట్రేషన్ చేయవద్దని, అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుని ఉంటే రద్దు చేయాలని శుక్రవారం కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్‌కు, ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్‌కు లేఖలు పంపించాం. విచారించి చర్యలు తీసుకుంటాం.

- గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

మున్సిపల్ అధికారులు నిరభ్యంతరం లేఖ ఇచ్చారు



2021లో మున్సిపాలిటీ 447/సిలో పార్కు స్థలం ఉందని రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ మున్సిపల్ అధికారులు లేఖ పంపారు. అయితే 2025లో మున్సిపాలిటీ పార్కు స్థలం కాదని నిరభ్యంతరం లేఖ ఇవ్వటంతో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ పూర్వపు పత్రాలు చూసి రిజిస్ట్రేషన్ చేశారు.

- సబ్ రిజిస్ట్రార్, శ్రీనివాసులు, ఎమ్మిగనూరు